# అన్నమయ్య కీర్తనలు

www.greatertelugu.com

గ్రేటర్ తెలుగు భక్తి కదంబం



# అన్నమయ్య  కీర్తనలు

## 100 కి పైగా అన్నమయ్య సంకీర్తనల సంపుటి



ఎందరో మహానుభావులు అందరీ వందనములు.

ఈ సంపుటిలో 100 కి పైగ అన్నమయ్య కీర్తనలను నిక్షిప్తంచేయటం జరిగింది.

వందనములు - గ్రేటర్ తెలుగు

## కీర్తన : కట్టెదుర వైకుంఠము

కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ
తెట్టలాయ మహిమలే తిరుమల కొండ ||

వేదములే శిలలై వెలసినది కొండ
యేదెస బుణ్యరాసులే యేరులైనది కొండ |
గాదిలి బ్రహ్మాది లోకముల కొనలు కొండ
శ్రీదేవు డుండేటి శేషాద్రి కొండ ||

సర్వదేవతలు మృగజాతులై చరించే కొండ
నిర్వహించి జలధులే నిట్టచరులైన కొండ |
వుర్వి దపసులే తరువులై నిలచిన కొండ
పూర్వ టంజనాద్రి యీ పొడవాటి కొండ ||

వరములు కొటారుగా వక్కాణించి పెంచే కొండ
పరగు లక్ష్మీకాంతు సోబనపు గొండ |
కురిసి సంపదలెల్ల గుహల నిండిన కొండ
విరివైన దదివో శ్రీ వేంకటపు గొండ ||

## కీర్తన : మూసిన  ముత్యాలకేలే

మూసిన ముత్యాల కేలే మొరగులు
ఆశల చిత్తాని కేలే అలవోకలు ||

కందులేని మోమున కేలే కస్తూరి
చింద నీ కొప్పున కేలే చేమంతులు |
మందయానమున కేలే మట్టెల మోతలు
గంధమేలే పైపై కమ్మని నీ మేనికి ||

భారపు గుబ్బల కేలే పయ్యెద నీ
బీరపు జూపుల కేలే పెడమోము |
జీరల భుజాల కేలే చెమటలు నీ
గోరంట గోళ్ళ కేలే కొనవాండ్లు ||

ముద్దుల మాటల కేలే ముదములు నీ
యద్దపు జెక్కుల కేలే అరవిరి |
వొద్దికమాటల కేలే వూర్పులు నీకు
నద్దమేలే తిరు వేంకటాద్రీశు గూడి ||

## కీర్తన : తిరువీథుల మెఱసీ దేవదేవుడు

తిరువీథుల మెఱసీ దేవదేవుడు
గరిమల మించిన సింగారములతోడను ‖

తిరుదండేలపై నేగీ దేవుడిదె తొలునాడు
సిరుల రెండవనాడు శేషునిమీద ।
మురిపేన మూడోనాడు ముత్యాల పందిరి క్రింద
పొరినాలుగోనాడు పువ్వు గోవిలలోను ‖

గ్రక్కున నైదవనాడు గరుడునిమీద
యెక్కను ఆరవనాడు యేనుగుమీద ‖
చొక్కమై యేడవనాడు సూర్యప్రభలోనను
యిక్కువ దేరును హుఱ్ఱ మెనిమిదోనాడు ‖

కనకపుటందలము కదిపి తొమ్మిదోనాడు
పెనచి పదోనాడు పెండ్లిపీట ।
యెనసి శ్రీ వేంకటేశు డింతి యలమేల్మంగతో
వనితల నడుమను వాహనాలమీదను ‖

## కీర్తన : వినరో భాగ్యము

వినరో భాగ్యము విష్ణుకథ
వెనుబలమిదివో విష్ణుకథ ॥

ఆది నుండి సంధ్యాది విధులలో
వేదంబయినది విష్ణుకథ ।
నాదించినిదె నారదాదులచే
వీధి వీధులనే విష్ణుకథ ।

వదలక వేదవ్యాసులు నుడివిన
విదిత పావనము విష్ణుకథ ।
సదనంబైనది సంకీర్తనయై
వెదకినచోటనే విష్ణుకథ ॥

గొల్లెతలు చల్లలు గొనకొని చిలుకగ
వెల్లి విరియాయె విష్ణుకథ ।
ఇల్లిదె శ్రీ వేంకటేశ్వరు నామము
వెల్లగొలిపె నీ విష్ణుకథ ॥

## కీర్తన : నారాయణతే

నారాయణతే నమో నమో
నారద సన్నుత నమో నమో ||

మురహర భవహర ముకుంద మాధవ
గరుడ గమన పంకజనాభ |
పరమ పురుష భవబంధ విమోచన
నర మృగ శరీర నమో నమో ||

జలధి శయన రవిచంద్ర విలోచన
జలరుహ భవనుత చరణయుగ |
బలిబంధన గోప వధూ వల్లభ
నలినో దరతే నమో నమో ||

ఆదిదేవ సకలాగమ పూజిత
యాదవకుల మోహన రూప |
వేదోద్ధర శ్రీ వేంకట నాయక
నాద ప్రియతే నమో నమో ||

రాగం: బేహాగ్
తాళం: ఆదితాళం

## కీర్తన : అన్ని మంత్రములు

అన్ని మంత్రములు నిందే ఆవహించెను
వెన్నతో నాకు గలిగె వేంకటేశు మంత్రము ||

నారదుండు జపియించె నారాయణ మంత్రము
చేరె ప్రహ్లాదుడు నారసింహ మంత్రము |
కోరి విభీషణుండు చేకొనె రామ మంత్రము
వేరె నాకు గలిగె వేంకటేశు మంత్రము ||

రంగగు వాసుదేవ మంత్రము ధ్రువుండు జపియించె
నంగ వింవె కృష్ణ మంత్ర మర్జునుండును |
ముంగిట విష్ణు మంత్రము మొగి శుకుడు పఠించె
వింగడమై నాకు నబ్బె వేంకటేశు మంత్రము ||

ఇన్ని మంత్రముల కెల్ల ఇందిరా నాధుండె గురి
పన్నిన దిదియె పర బ్రహ్మ మంత్రము |
నన్నుగావ కలిగె బో నాకు గురు డియ్యగాను
వెన్నెల వంటిది శ్రీ వేంకటేశు మంత్రము ||

## కీర్తన : చందమామ రావో

చందమామ రావో జాబిల్లి రావో
కుందనపు పైడి కోర వెన్న పాలు తేవో ||

నగుమోము చక్కని యయ్యకు నలువ బుట్టించిన తండ్రికి
నిగమము లందుండే యప్పకు మా నీల వర్ణునికి |
జగమెల్ల నేలిన స్వామికి ఇందిర మగనికి
ముగురికి మొదలైన ఘనునికిమా ముద్దుల మురారి బాలునికి ||

తెలిదమ్మి కన్నుల మేటికి మంచి తియ్యని మాటల గుమ్మకు
కలికి చేతల కోడెకుమా కతల కారి ఈ బిడ్డకు |
కుల ముద్ధించిన పట్టెకు మంచి గుణములు కలిగిన కోడెకు
నిలువెల్ల నిండు వొయ్యారికి నవ నిధుల చూపుల జూసే సుగుణునకు ||

సురల గాచిన దేవరకు చుంచు గరుడుని నెక్కిన గబ్బికి
నెరవాది బుద్ధుల పెద్దకు మా నీటు చేతల పట్టికి |
విరుల వింటి వాని యయ్యకు వేవేలు రూపుల స్వామికి
సిరిమించు నెరవాది జాణకు మా శ్రీ వేంకటేశ్వరునికి ||

## కీర్తన : ఇందరికీ అభయంబు

ఇందరికీ అభయంబు లిచ్చు చేయి
కందువగు మంచి బంగారు చేయి ||

వెలలేని వేదములు వెదికి తెచ్చిన చేయి
విలుకు గుబ్బలి కింద చేర్చు చేయి |
కలికియగు భూకాంత కాగలించిన చేయి
వలవైన కొనగోళ్ళ వాడిచేయి ||

తనివోక బలి చేత దానమడిగిన చేయి
వొనరంగ భూ దాన మొసగు చేయి |
మొనసి జలనిధి యమ్ముమొనకు తెచ్చిన చేయి
ఎనయ నాగేలు ధరియించు చేయి ||

పురసతుల మానములు పొల్లసేసిన చేయి
తురగంబు బరపెడి దొడ్డ చేయి |
తిరువేంకటాచల ధీశుడై మోక్షంబు
తెరువు ప్రాణుల కెల్ల తెలిపెడి చేయి ||

రాగం: కాంభోజి రాగం

## కీర్తన : అదివో అల్లదివో

అదివో అల్లదివో శ్రీ హరి వాసము
పదివేల శేషుల పడగల మయము ॥

అదె వేంకటాచల మఖిలోన్నతము
అదివో బ్రహ్మాదుల కపురూపము ।
అదివో నిత్యనివాస మఖిల మునులకు
అదె చూడు డదె మొక్కు డానందమయము ॥

చెంగట నదివో శేషాచలమూ
నింగి నున్న దేవతల నిజవాసము ।
ముంగిట నల్లదివో మూలనున్న ధనము
బంగారు శిఖరాల బహు బ్రహ్మమయము ॥

కైవల్య పదము వేంకట నగ మదివో
శ్రీ వేంకటపతికి సిరులైనది ।
భావింప సకల సంపద రూపమదివో
పావనముల కెల్ల పావన మయమూ ॥

రాగం: మధ్యమావతి

## కీర్తన : తందనాన అహి

తందనాన అహి, తందనాన పురె
తందనాన భళా, తందనాన ||

బ్రహ్మ మొకటే, పర
బ్రహ్మ మొకటే, పర
బ్రహ్మ మొకటే, పర
బ్రహ్మ మొకటే ||

కందువగు హీనాధికము లిందు లేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ |
ఇందులో జంతుకుల మంతా ఒకటే
అందరికీ శ్రీహరే అంతరాత్మ ||

నిండార రాజు నిద్రించు నిద్రయునొకటే
అండనే బంటు నిద్ర – అదియు నొకటే |
మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమియొకటే
చండాలుడుండేటి సరిభూమి యొకటే ||

అనుగు దేవతలకును అల కామ సుఖ మొకటే
ఘన కీట పశువులకు కామ సుఖ మొకటే |
దిన మహోరాత్రములు – తెగి ధనాఢ్యున కొకటే
వొనర నిరుపేదకును ఒక్కటే అవియు ||

కొరలి శిష్టాన్నములు తును నాక లొకటే
తిరుగు దుష్టాన్నములు తిను నాక లొకటే |
పరగ దుర్గంధములపై వాయు వొకటే
వరస పరిమళముపై వాయు వొకటే ||

కడగి ఏనుగు మీద కాయు ఎండొకటే
పుడమి శునకము మీద బొలయు నెండొకటే |
కడు పుణ్యులను – పాప కర్ములను సరి గావ
జడియు శ్రీ వేంకటేశ్వరు నామ మొకటే ||

Get Telugu books at http://greatertelugu.com

## కీర్తన : మనుజుడై పుట్టి

మనుజుడై పుట్టి మనుజుని సేవించి
అనుదినము దుఃఖమందనేలా ॥

జుట్టెడు కడుపుకై చొరని చోట్లు జొచ్చి
పట్టెడు కూటికై బతిమాలి ।
పుట్టిన చోటికే పొరలి మనసువెట్టి
వట్టి లంపటము వదలనేరడుగాన ॥

అందరిలో పుట్టి అందరిలో చేరి
అందరి రూపములటు తానై ।
అందమైన శ్రీ వేంకటాద్రీశు సేవించి
అందరాని పద మందెనటుగాన ॥

## కీర్తన : ఎక్కువ కులజుడైన

ఎక్కువ కులజుడైన హీన కులజుడైన
నిక్కమెరిగిన మహా నిత్యుడే ఘనుడు ॥

వేదములు చదివియును విముఖుడై హరిభక్తి
యాదరించని సోమయాజి కంటె ।
ఏదియును లేని కుల హీనుడైనను విష్ణు
పాదములు సేవించు భక్తుడే ఘనుడు ॥

పరమ మగు వేదాంత పఠన దొరికియు సదా
హరి భక్తి లేని సన్యాసి కంటె ।
సరవి మాలిన అంత్య జాతి కులజుడైన
నరసి విష్ణుని వెదకు నాతడే ఘనుడు ॥

వినియు చదివియు, శ్రీ విభుని దాసుడు గాక
తనువు వేపుచు నుండు తపసి కంటె ।
ఎనలేని తిరు వేంకటేశు ప్రసాదాన్న
మనుభవించిన యాతడప్పుడే ఘనుడు ॥

## కీర్తన : కొండలలో నెలకొన్న

కొండలలో నెలకొన్న కోనేటి రాయడు వాడు
కొండలంత వరములు గుప్పెడు వాడు ॥

కుమ్మర దాసుడైన కురువరతి నంబి
ఇమ్మన్న వరములెల్ల ఇచ్చినవాడు ।
దొమ్ములు సేసిన యట్టి తొండమాన్ చక్కురవర్తి
రమ్మన్న చోటికి వచ్చి నమ్మిన వాడు ॥

అచ్చపు వేడుకతోడ ననంతాళ్వారుకి
ముచ్చిలి వెట్టికి మన్ని మోసినవాడు ।
మచ్చిక దొలక తిరునంబి తోడుత
నిచ్చ నిచ్చ మాటలాడి నొచ్చినవాడు ॥

కంచిలోన నుండు దిరుకచ్చినంబి మీద గరు-
ణించి తన యెడకు రప్పించిన వాడు ।
యెంచి ఎక్కుడైన వేంకటేశుడు మనలకు
మంచివాడై కరుణ బాలించిన వాడు ॥

## కీర్తన : షోడసకళానిధికి

షోడసకళానిధికి షోడశోపచారములు
జాడతోడ నిచ్చలును సమర్పయామి ||

అలరు విశ్వాత్మకున కావాహన మిదె సర్వ
నిలయున కాసనము నెమ్మినిదే |
అలగంగా జనకున కర్ఘ్యపాద్యాచమనాలు
జలధి శాయికిని మజ్జనమిదే ||

వరపీతాంబరునకు వస్త్రాలంకారమిదె
సరి శ్రీమంతునకు భూషణము లివే |
ధరణీధరునకు గంధపుష్ప ధూపములు
తిరమిదె కోటిసూర్యతేజునకు దీపము ||

అమృతమథనునకు నదివో నైవేద్యము
గమి(రవి)జంద్రునేత్రునకు కప్పురవిడెము |
అమరిన శ్రీవేంకటాద్రి మీది దేవునికి
తమితో ప్రదక్షిణాలు దండములు నివిగో ||

## కీర్తన : జో అచ్యుతానంద

జో అచ్యుతానంద జోజో ముకుందా
రావె పరమానంద రామ గోవిందా ||

అంగజుని గన్న మా యన్న యిటు రారా
బంగారు గిన్నెలో పాలు పోసేరా |
దొంగ నీవని సతులు గొంకుచున్నారా
ముంగిట నాడరా మోహనాకార ||

గోవర్ధనంబెల్ల గొడుగుగా పట్టి
కావరమ్మున నున్న కంసుపడగొట్టి |
నీవు మధురాపురము నేలచేపట్టి
ఠీవితో నేలిన దేవకీపట్టి ||

నందు నింటను జేరి నయము మీఱంగ
చంద్రవదనలు నీకు సేవ చేయంగ |
నందముగ వారిండ్ల నాడుచుండంగ
మందలకు దొంగ మా ముద్దురంగ ||

పాలవారాశిలో పవళించినావు
బాలుగా మునుల కభయమిచ్చినావు |
మేలుగా వసుదేవు కుదయించినావు
బాలుడై యుండి గోపాలుడైనావు ||



అట్టుగట్టిన మీగ డట్టె తిన్నాడే

అట్టె తినెనని యత్త యడగ విన్నాడే
గట్టిగా నిది దొంగ కొట్టుమన్నాడే ॥

గొల్లవారిండ్లకు గొబ్బునకుబోయి
కొల్లలుగా త్రావి కుండలను నేయి।
చెల్లునా మగనాండ్ర జెలిగి యీశాయీ
చిల్లతనములు సేయ జెల్లునటవోయి ॥

రేపల్లె సతులెల్ల గోపంబుతోను
గోపమ్మ మీ కొడుకు మా యింఢ్ల లోను।
మాపుగానే వచ్చి మా మానములను
నీ పాపడే చెఱిచె నేమందుమమ్మ ॥

ఒకని యాలినిదెచ్చి నొకని కడబెట్టి
జగడములు కలిపించి సతిపతులబట్టి।
పగలు నలుజాములును బాలుడై నట్టి
మగనాండ్ర చేపట్టి మదనుడై నట్టి ॥

అలిగి తృణావర్తు నవని గూల్చితివి
బలిమిమై బూతన బట్టి పీల్చితివి।
చెలగి శకటాసురుని జేరి డొల్చితివి
తలచి మద్దులు రెండు ధరణి వ్రాల్చితివి ॥

హంగుగా తాళ్ళపాకన్నయ్య చాల
శృంగార రచనగా చెప్పె నీ జోల।
సంగతిగ సకల సంపదల నీవేళ
మంగళము తిరుపట్ల మదనగోపాల ॥

## కీర్తన : జగడపు చనువుల

జగడపు చనువుల జాజర
సగినల మంచపు జాజర ||

మొల్లలు తురుముల ముడిచిన బరువున
మొల్లపు సరసపు మురిపెమున |
జల్లన పుప్పొడి జారగ పతిపై చల్లే పతిపై
చల్లే రతివలు జాజర ||

భారపు కుచముల పైపై కడు సిం-
గారము నెరపేటి గంధవొడి |
చేరువ పతిపై చిందగ పడతులు
సారెకు చల్లేరు జాజర ||

బింకపు కూటమి పెనగేటి చెమటల
పంకపు పూతల పరిమళము |
వేంకటపతిపై వెలదులు నించేరు
సంకుమ దంబుల జాజర ||

## కీర్తన : ఎంత మాత్రమున

ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన, అంతమాత్రమే నీవు
అంతరాంతరములెంచి చూడ, పిండంతే నిప్పటి అన్నట్లు ||

కొలుతురు మిము వైష్ణవులు, కూరిమితో విష్ణుడని
పలుకుదురు మిము వేదాంతులు, పరబ్రహ్మంబనుచు |
తలతురు మిము శైవులు, తగిన భక్తులునూ శివుడనుచు
అలరి పొగడుదురు కాపాలికులు, ఆది భైరవుడనుచు |

సరి మిమ్ముదురు సాక్తేయులు, శక్తి రూపు నీవనుచు
దరిశనములు మిము నానా విధులను, తలుపుల కొలదుల భజింతురు |
సిరుల మిమునే అల్పబుద్ధి, తలచినవారికి అల్పంబగుదవు
దరిమల మిమునే ఘనమని తలచిన, ఘనబుద్ధులకు ఘనుడవు ||

నీవలన కొరతే లేదు మరి నీరు కొలది తామరవు
ఆవల భాగీరధి దరి వాగుల ఆ జలమే ఊరినయట్లు |
శ్రీ వేంకటపతి నీవైతే మము చేకొని వున్న దైవ(ము)మని
ఈవలనే నీ శరణని ఎదను, ఇదియే పరతత్వము నాకు ||

## కీర్తన : బ్రహ్మ కడిగిన పాదము

బ్రహ్మ కడిగిన పాదము
బ్రహ్మము దానె నీ పాదము ||

చెలగి వసుధ గొలిచిన నీ పాదము
బలి తల మోపిన పాదము |
తలకగ గగనము తన్నిన పాదము
బలరిపు గాచిన పాదము ||

కామిని పాపము కడిగిన పాదము
పాముతల నిడిన పాదము |
ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము
పామిడి తురగపు పాదము ||

పరమ యోగులకు పరి పరి విధముల
పరమొసగెడి నీ పాదము |
తిరువేంకటగిరి తిరమని చూపిన
పరమ పదము నీ పాదము ||

## కీర్తన : నానాటి బతుకు

నానాటి బతుకు నాటకము
కానక కన్నది కైవల్యము ||

పుట్టుటయు నిజము, పోవుటయు నిజము
నట్టనడిమి పని నాటకము |
యెట్టనెదుటి కలదీ ప్రపంచము
కట్ట గడపటిది కైవల్యము ||

కుడిచేదన్నము కోక చుట్టెడిది
నడుమంత్రపు పని నాటకము |
వొడి కట్టుకొనిన ఉభయ కర్మములు
గడి దాటినపుడే కైవల్యము ||

తెగదు పాపము, తీరదు పుణ్యము
నగి నగి కాలము నాటకము |
ఎగువనే శ్రీ వేంకటేశ్వరుడేలిక
గగనము మీదిది కైవల్యము ||

రాగం: ముఖారి

## కీర్తన : భావయామి గోపాలబాలం

భావయామి గోపాలబాలం మన-
స్సేవితం తత్పదం చింతయేహం సదా ॥

కటి ఘటిత మేఖలా ఖచితమణి ఘంటికా-
పటల నినదేన విభ్రాజమానమ్ ।
కుటిల పద ఘటిత సంకుల శింజితేనతం
చటుల నటనా సముజ్జ్వల విలాసమ్ ॥

నిరతకర కలిత నవనీతం బ్రహ్మాది
సుర నికర భావనా శోభిత పదమ్ ।
తిరువేంకటాచల స్థితమ్ అనుపమం హరిం
పరమ పురుషం గోపాలబాలమ్ ॥

రాగం: యమునా కళ్యాణి
తాళం: ఆది

## కీర్తన : అలర చంచలమైన

అలర చంచలమైన ఆత్మలందుండ నీ యలవాటు చేసె నీ వుయ్యాల ।
పలుమారు నుచ్ఛ్వాస పవనమందుండ నీ భావంబు దెలిపె నీ వుయ్యాల ॥

ఉదాయాస్త శైలంబు లొనర కంభములైన వుడుమండలము మోచె నుయ్యాల ।
అదన ఆకాశపదము అడ్డదూలంబైన అఖిలంబు నిండె నీ వుయ్యాల ॥

పదిలముగ వేదములు బంగారు చేరులై పట్టి వెరపై తోచె వుయ్యాల ।
వదలకిటు ధర్మదేవత పీఠమై మిగుల వర్ణింప నరుదాయె వుయ్యాల ॥

మేలు కట్లయి మీకు మేఘమండలమెల్ల మెరుగునకు మెరుగాయె వుయ్యాల ।
నీల శైలమువంటి నీ మేనికాంతికి నిజమైన తొడవాయె వుయ్యాల ॥

పాలిండ్లు కదలగా పయ్యదలు రాపాడ భామినులు వడినూచు వుయ్యాల ।
వోలి బ్రహ్మాండములు వొరగువో యని భీతి నొయ్య నొయ్యనైరి వూచిరుయ్యాల ॥

కమలకును భూపతికి కదలు కదలకు మిమ్ము కౌగలింపగజేసె నుయ్యాల ।
అమరాంగనలకు నీ హాస భావ విలాస మందంద చూపె నీ వుయ్యాల ॥

కమలాసనాదులకు కన్నుల పండుగై గణుతింప నరుదాయె వుయ్యాల ।
కమనీయ మూర్తి వేంకటశైలపతి నీకు కడువేడుకై వుండె వుయ్యాల ॥

## కీర్తన : అలరులు గురియగ

అలరులు గురియగ నాడెనదే ।
అలకల గులుకుల నలమేలుమంగ ॥

అరవిరి సొబగుల నతివలు మెచ్చగ
అర తెర మరుగున నాడె నదే ।
వరుసగ పూర్వదు వాళపు తిరుపుల
హరి గరగింపుచు నలమేలుమంగ ॥

మట్టపు మలపుల మట్టెలకెలపుల
తట్టెడి నడపుల దాటెనదే ।
పెట్టిన వజ్రపు పెండెపు దళుకులు
అట్టిట్టు చిమ్ముచు నలమేలుమంగ ॥

చిందుల పాటల శిరిపొలయాటల
అందెల మ్రోతల నాడె నదే ।
కందువ తిరువెంకటపతి మెచ్చగ
అందపు తిరుపుల నలమేలుమంగ ॥

రాగం: శంకరాభరణం

## కీర్తన : అమ్మమ్మ ఏమమ్మ

అమ్మమ్మ ఏమమ్మ అలమేల్మంగ నాంచారమ్మ ।
తమ్మియింట నలరుకొమ్మ ఓయమ్మ ॥

నీరిలోన తల్లడించే నీకే తలవంచి
నీరికింద పులకించి నీరమణుండు ।
గోరికొన చెమరించి కోపమే పచరించి
సారెకు నీయలుక ఇట్టె చాలించవమ్మ ॥

నీకుగానే చెయ్యిచాచి నిండాకోపమురేచి
మేకొని నీవిరహాన మేను వెంచిని ।
ఈకడాకడి సతుల హృదయమే పెరరేచి
ఆకు మడిచియ్యనైన ఆనతియ్యవమ్మా ॥

చక్కదనములె పెంచి సకలము గాలదంచి
నిక్కపు వేంకటేశుడు నీకే పొంచిని ।
మక్కువతో అలమేల్మంగ నాంచారమ్మ
అక్కున నాతని నిట్టే అలరించవమ్మ ॥

## కీర్తన : అందరికాధారమైన

అందరికాధారమైన ఆది పురుషుడీతడు
విందై మున్నారగించె విదురునికడ నీతుడు ||

సనకాదులు కొనియాడెడి సర్వాత్మకుడీతడు
వనజ భవాదులకును దైవంబై నతడీతడు |
ఇనమండలమున జెలగేటిహితవై భవుడితడు
మునుపుట్టిన దేవతలకు మూలభూతి యీతడు ||

సిరులొసగి యశోదయింట శిశువైనత డీతడు
ధరనావుల మందలలో తగ జరించె నీతడు |
సరసతలను గొల్లెతలకు జనవులొసగె నీతడు
ఆరసి కుచేలుని యడుకులు ఆరగించెనీతడు ||

పంకజభవునకును బ్రహ్మ పద మొసగెను యీతుడు
సంకీర్తన లాద్యులచే జట్టి గొనియెనీతడు |
తెంకిగ నేకాలము పరదేవుడైన యీతడు
వేంకటగిరి మీద ప్రభల వెలసిన ఘనుడీతడు ||

## కీర్తన : అంతర్యామి అలసితి

అంతర్యామి అలసితి సొలసితి ।
ఇంతటు నీ శరణిదె జొచ్చితిని ॥

కోరిన కోర్కులు కోయని కట్లు ।
తీరవు నీవవి తెంచక ।
భారపు బగ్గాలు పాప పుణ్యములు ।
నేరుపుల బోనీవు నీవు వద్దనక ॥

జనుల సంగముల జక్క రోగములు ।
విను విడువవు నీవు విడిపించక ।
వినయపు దైన్యము విడువని కర్మము ।
చనదది నీవిటు శాంతపరచక ॥

మదిలో చింతలు మైలలు మణుగులు ।
వదలవు నీవవి వద్దనక ।
ఎదుటనె శ్రీ వెంకటేశ్వర నీవదె ।
అదన గాచితివి అట్టిట్టనక ॥

రాగం: శివ రంజని

## కీర్తన : అతిదుష్టుడ నే నలసుడను

అతిదుష్టుడ నే నలసుడను ।
యితరవివేకం బికనేల ॥

ఎక్కడ నెన్నిట యేమి సేసితినొ
నిక్కపుదప్పులు నేరములు ।
గక్కన నిన్నిట కలిగిననీవే
దిక్కుగాక మరి దిక్కేది ॥

ఘోరపుబాపము కోట్లసంఖ్యలు
చేరువ నివె నాచేసినివి ।
నీరసునకు నిటు నీకృప నాకిక
కూరిమి నా యెడ గుణమేది ॥

యెఱిగి చేసినది యెఱుగక చేసిన-
కొఱతలు నాయెడ గోటులివే ।
వెఱపు దీర్చి శ్రీవేంకటేశ కావు
మఱవక నాగతి మఱి యేది ॥

## కీర్తన : భావములోనా

భావములోనా బాహ్యమునందును ।
గోవింద గోవిందయని కొలువవో మనసా ॥

హరి యవతారములే యఖిల దేవతలు
హరి లోనివే బ్రహ్మాండంబులు ।
హరి నామములే అన్ని మంత్రములు
హరి హరి హరి హరి యనవో మనసా ॥

విష్ణుని మహిమలే విహిత కర్మములు
విష్ణుని పొగడెడి వేదంబులు ।
విష్ణుడొక్కడే విశ్వాంతరాత్ముడు
విష్ణువు విష్ణువని వెదకవో మనసా ॥

అచ్యుతుడితడే ఆదియు నంత్యము
అచ్యుతుడే యసురాంతకుడు ।
అచ్యుతుడు శ్రీవేంకటాద్రి మీదనిదె
అచ్యుత యచ్యుత శరణనవో మనసా ॥

## కీర్తన : చాలదా బ్రహ్మమిది

చాలదా బ్రహ్మమిది సంకీర్తనం మీకు |
జాలెల్ల నడగించు సంకీర్తనమ్ ||

సంతోష కరమైన సంకీర్తనమ్ |
సంతాప మణగించు సంకీర్తనమ్ |
జంతువుల రక్షించు సంకీర్తనమ్ |
సంతతము దలచుడీ సంకీర్తనమ్ ||

సామజము గాంచినది సంకీర్తనమ్ |
సామమున కెక్కుడీ సంకీర్తనమ్ |
సామీప్య మిందరికి సంకీర్తనమ్ |
సామాన్యమా విష్ణు సంకీర్తనమ్ ||

జముబారి విడిపించు సంకీర్తనమ్ |
సమ బుద్ధి వొడమించు సంకీర్తనమ్ |
జమళి సౌఖ్యములిచ్చు సంకీర్తనమ్ |
శమదమాదుల జేయు సంకీర్తనమ్ ||

జలజాసనుని నోరి సంకీర్తనమ్ |
చలిగొండ సుతదలచు సంకీర్తనమ్ |
చలువ గడు నాలుకకు సంకీర్తనమ్ |
చలపట్టి తలచుడీ సంకీర్తనమ్ ||

సరవి సంపదలిచ్చు సంకీర్తనమ్ |
సరిలేని దిదియపో సంకీర్తనమ్ |
సరుస వేంకట విభుని సంకీర్తనమ్ |
సరుగనను దలచుడీ సంకీర్తనమ్ ||

## కీర్తన : చాలదా హరి నామ

చాలదా హరి నామ సౌఖ్యామృతము దమకు |
చాలదా హితవైన చవులెల్లను నొసగ ||

ఇది యొకటి హరి నామ మింత్రైన జాలదా |
చెదరకీ జన్మముల చెరలు విడిపించ |
మదినొకటె హరినామ మంత్రమది చాలదా |
పదివేల నరక కూపముల వెడలించ ||

కలదొకటి హరినామ కనకాద్రి చాలదా |
తొలగుమని దారిద్ర్యదోషంబు చెరుచ |
తెలివొకటి హరినామదీప మది చాలదా |
కలుషంపు కఠిన చీకటి పారద్రోల ||

తగువేంకటేశు కీర్తనమొకటి చాలదా |
జగములో కల్పభూజంబు వలె నుండ |
సొగసి యీవిభుని దాసుల కరుణ చాలదా |
నగవు జూపులను నున్నతమెపుడు జూప ||

రాగము : హంసధ్వని

## కీర్తన : చదువులోనే హరిని

చదువులోనే హరిని జట్టిగొనవలెగాక |
మదముగప్పినమీద మగుడ నది గలదా ||

జడమతికి సహజమే సంసారయాతన యిది |
కడు నిందులో బరము గడియించవలెగాక |
తొడరి గాలప్పుడు తూర్పెత్తక తాను |
విడిచి మఱచిన వెనక వెదకితే గలదా ||

భవబంధునకు విధిపాపపుణ్యపులంకె |
తివిరి యిందునే తెలివి తెలుసుకోవలెగాక |
అవల వెన్నెలలోనే అల్లునేరే ళ్లింతే |
నివిరి నిన్నటివునికి నేటికి గలదా ||

దేహధారికి గలదే తెగనియింద్రియబాధ |
సాహసంబున భక్తి సాధించవలెగాక |
యిహలను శ్రీవేంకటేశుదాసులవలన |
వూహించి గతిగానక వొదిగితే గలదా ||

## కీర్తన : చక్కని తల్లికి చాంగుభళా

చక్కని తల్లికి చాంగుభళా తన
చక్కెర మోవికి చాంగుభళా ||

కులికెడి మురిపెపు కుమ్మరింపు తన
సళుపు జూపులకు చాంగుభళా |
పలుకుల సొంపుల బతితో గసరెడి
చలముల యలుకకు చాంగుభళా ||

కిన్నెరతో పతి కెలన నిలుచు తన
చన్ను మెఱుగులకు చాంగుభళా |
ఉన్నతి బతిపై నొరగి నిలుచు తన
సన్నపు నడిమికి చాంగుభళా ||

జందెపు ముత్యపు సరులహారముల
చందన గంధికి చాంగుభళా |
విందయి వెంకట విభుబెన చినతన
సంది దండలకు చాంగుభళా ||

రాగం: పాడి

## కీర్తన : చేరి యశోదకు

చేరి యశోదకు శిశు వితడు
ధారుణి బ్రహ్మకు తండ్రియు నితడు ॥

సొలసి చూచినను సూర్యచంద్రులను
లలి వెదచల్లెడులక్షణుడు ।
నిలిచిననిలువున నిఖిలదేవతల
కలిగించు సురలగనివో యితడు ॥

మాటలాడినను మరియజాండములు
కోటులు వొడమేటిగుణరాశి ।
నీటగునూర్పుల నిఖిలవేదములు
చాటువనూ రేటిసముద్ర మితడు ॥

ముంగిట జొలసిన మోహన మాత్మల
బొంగించేఘనపురుషుడు ।
సంగతి మావంటిశరణాగతులకు
నంగము శ్రీవేంకటాధిపు డితడు ॥

## కీర్తన : చూడరమ్మ సతులారా

చూడరమ్మ సతులారా సోబాన పాడరమ్మ |
కూడున్నది పతి చూడి కుడుత నాంచారి ||

శ్రీమహాలక్ష్మియట సింగారాలకే మరుదు |
కాముని తల్లియట చక్కదనాలకే మరుదు |
సోముని తోబుట్టువట సొంపుకళలకేమరుదు |
కోమలాంగి ఈ చూడి కుడుత నాంచారి ||

కలశాబ్ధి కూతురట గంభీరలకే మరుదు |
తలపలోక మాతయట దయ మరి ఏమరుదు |
జలజనివాసినియట చల్లదనమేమరుదు |
కొలదిమీర ఈ చూడి కుడుత నాంచారి ||

అమరవందితయట అట్టి మహిమ ఏమరుదు |
అమృతము చుట్టమట ఆనందాలకేమరుదు |
తమితో శ్రీవేంకటేశు దానె వచ్చి పెండ్లాడె |
కౌమెర వయస్సు ఈ చూడి కుడుత నాంచారి ||

## కీర్తన : దాచుకో నీపాదాలకుదగ

దాచుకో నీపాదాలకుదగ నే జేసినపూజ లివి ।
పూచి నీకీరీతిరూపపుష్పము లివి యయ్యా ॥

వొక్క సంకీర్తనె చాలు వొద్దికై మమ్ము రక్షించగ ।
తక్కినవి భాండారాన దాచి వుండనీ ।
వెక్కసమగునీ నామము వెల సులభము ఫల మధికము ।
దిక్కై నన్నేలితి వికనవి తీరని నా ధనమయ్యా ॥

నానాలికపైనుండి నానాసంకీర్తనలు ।
పూని నాచే నిన్ను బొగడించితివి ।
వేనామాల వెన్నుడా వినుతించ నెంతవాడ ।
కానిమ్మని నా కీపుణ్యము గట్టితి వింతేయయ్యా ॥

యీమాట గర్వము గాదు నీ మహిమే కొనియాడితిగాని ।
చేముంచి నాస్వాతంత్ర్యము చెప్పినవాడగాను ।
నేమాన బాడేవాడను నేరము లెంచకుమీ ।
శ్రీమాధవా నే నీదాసుడ శ్రీవేంకటేశుడవయ్యా ॥

రాగం: ఆరభి

## కీర్తన : రామ దశరథరామ

రామ దశరథరామ నిజ సత్య-
కామ నమో నమో కాకుత్థ్సరామ ||

కరుణానిధి రామ కౌసల్యానందన రామ
పరమ పురుష సీతాపతిరామ |
శరధి బంధన రామ సవన రక్షక రామ
గురుతర రవివంశ కోదండ రామ ||

దనుజహరణ రామ దశరథసుత రామ
వినుతామర స్తోత్ర విజయరామ |
మనుజావతారా రామ మహనీయ గుణరామ
అనిలజప్రియ రామ అయోధ్యరామ ||

సులలితయశ రామ సుగ్రీవ వరద రామ
కలుష రావణ భయంకర రామ |
విలసిత రఘురామ వేదగోచర రామ
కలిత ప్రతాప శ్రీవేంకటగిరి రామ ||

## కీర్తన : దేవ దేవం భజే

దేవ దేవం భజే దివ్యప్రభావమ్ ।
రావణాసురవైరి రణపుంగవమ్ ॥

రాజవరశేఖరం రవికులసుధాకరం
ఆజానుబాహు నీలాభ్రకాయమ్ ।
రాజారి కోదండ రాజ దీక్షాగురుం
రాజీవలోచనం రామచంద్రమ్ ॥

నీలజీమూత సన్నిభశరీరం ఘనవి-
శాలవక్షం విమల జలజనాభమ్ ।
తాలాహినగహరం ధర్మసంస్థాపనం
భూలలనాధిపం భోగిశయనమ్ ॥

పంకజాసనవినుత పరమనారాయణం
శంకరార్జిత జనక చాపదళనమ్ ।
లంకా విశోషణం లాలితవిభీషణం
వెంకటేశం సాధు విబుధ వినుతమ్ ॥

రాగం: ధన్నాసి

## కీర్తన : దేవ యీ తగవు

దేవ యీ తగవు దీర్చవయ్యా
వేవేలకు నిది విన్నపమయ్యా ||

తనువున బొడమినతతి నింద్రియములు
పొనిగి యెక్కడికి బోవునయా |
పెనగి తల్లికడ బిడ్డలు భువిలో
యెనగొని యెక్కడి కేగుదురయ్యా ||

పొడుగుచు మనమున బొడమిన యాసలు
అదన నెక్కడికి నరుగునయా |
వొడుగుచు జలములనుండు మత్స్యములు
పదపడి యేగతి బాసీనయ్యా ||

లలి నొకటొకటికి లంకెలు నివే
అలరుచు నేమని యందునయా |
బలు శ్రీవేంకటపతి నాయాత్మను
గలిగితి వెక్కడి కలుషములయ్యా ||

## కీర్తన : డోలాయాం చల డోలాయాం

డోలాయాం చల డోలాయాం హరే డోలాయామ్ ||

మీనకూర్మ వరాహా మృగపతిఅవతారా |
దానవారే గుణశౌరే ధరణిధర మరుజనక ||

వామన రామ రామ వరకృష్ణ అవతారా |
శ్యామలాంగా రంగ రంగా సామజవరద మురహరణ ||

దారుణ బుద్ధ కలికి దశవిధఅవతారా |
శీరపాణే గోసమాణే శ్రీ వేంకటగిరికూటనిలయ || 2 ||

రాగం: వరాళి

## కీర్తన : ఏపురాణముల నెంత

ఏపురాణముల నెంత వెదికినా ।
శ్రీపతిదాసులు చెడ రెన్నడును ॥

వారివిరహితములు అవి గొన్నాళ్ళకు ।
విరసంబులు మరి విఫలములు ।
నరహరి గొలి చిటు నమ్మినవరములు ।
నిరతము లెన్నడు నెలవులు చెడవు ॥

కమలాక్షుని మతిగాననిచదువులు ।
కుమతంబులు బహుకుపథములు ।
జమళి నచ్యుతుని సమారాధనలు ।
విమలములే కాని వితథముగావు ॥

శ్రీవల్లభుగతి జేరనిపదవులు ।
దావతులు కపటధర్మములు ।
శ్రీవేంకటపతి సేవించునేవలు ।
పావనము లధికభాగ్యపుసిరులు ॥

## కీర్తన : ఈ సురలీమును

ఈ సురలీమును లీచరాచరములు ।
యిసకలమంతయు నిది యెవ్వరు ॥

ఎన్నిక నామము లిటు నీవై యుండగ ।
యిన్ని నామము లిటు నీవై యుండగ ।
వున్నచోటనే నీవు వుండుచుండుగ మరి ।
యిన్నిటా దిరుగువా రిది యెవ్వరు ॥

వొక్కరూపై నీవు వుండుచుండగ మరి ।
తక్కిన యీరూపములు తామెవ్వరు ।
యిక్కడనక్కడ నీవు యిటు ఆత్మలలోనుండ ।
మక్కువ నుండువారు మరి యెవ్వరు ॥

శ్రీవేంకటాద్రిపై చెలగి నీ వుండగా ।
దైవంబులనువారు తామెవ్వరు ।
కావలసినచోట కలిగి నీవుండగ ।
యీవిశ్వపరిపూణు లిది యెవ్వరు ॥

## కీర్తన : ఏలే యేలే మరదలా

ఏలే యేలే మరదలా చాలుజాలు ।
చాలును చాలు నీతోడి సరసంబు బావ ॥

గాటపు గుబ్బలు గదలగ గులికేవు ।
మాటల దేటల మరదలా ।
చీటికి మాటికి జెనకేవే వట్టి ।
బూటకాలు మానిపోవే బావ ॥

అందిందె నన్ను నదలించి వేసేవు ।
మందమేలపు మరదలా ।
సందుకో దిరిగేవి సటకారివో బావ ।
పొందుగాదిక బోవే బావ ॥

చొక్కపు గిలిగింతల చూపుల నన్ను ।
మక్కువ సేసిన మరదలా ।
గక్కున నను వేంకటపతి కూడితి ।
దక్కించుకొంటివి తగులైతి బావ ॥

## కీర్తన : ఏమని పొగదుడుమే

ఏమని పొగదుడుమే యికనిను |
ఆమని సొబగుల అలమేల్మంగ ||

తెలికన్నుల నీ తేటలే కదవే |
వెలయగ విభునికి వెన్నెలలు |
పులకల మొలకల పొదులివి గదవే |
పలుమరు పువ్వుల పానుపులు ||

తియ్యపు నీమోవి తేనెలే కదవే |
వియ్యపు రమణుని విందులివి |
ముయ్యక మూసిన మొలక నవ్వు గదె |
నెయ్యపు గప్పురపు నెరి బాగాలు ||

కైవసమగు నీ కౌగిలే కదవే |
శ్రీ వేంకటేశ్వరు సిరి నగరు |
తావు కొన్న మీ తమకములే కదే |
కావించిన మీ కల్యాణములు ||

రాగం:ఆభేరి

తాళం :ఆదితాళం

## కీర్తన : ఏమొకో చిగురుటధరమున

ఏమొకో చిగురుటధరమున ఎడనెడకస్తూరి నిండెను ।
భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదు కదా ॥

కలికి చకోరాక్షికి కడకన్నులు కెంపైతోచిన ।
చెలువంబిప్పుడిదేమో చింతింపరేచెలులు ।
నలువున ప్రాణేశ్వరునిపై నాటినయాకొనచూపులు ।
నిలువునపెరుకగనంటిన నెత్తురుకాదుకదా ॥

పడతికి చనుగవమెరుగులు పైపై పయ్యెద వెలుపల ।
కదుమించిన విధమేమో కనుగొనరే చెలులు ।
వుడుగని వేడుకతో ప్రియుడొత్తిన నఖశశిరేఖలు ।
వెడలగవేసవికాలపు వెన్నెలకాదుకదా ॥

ముద్దియ చెక్కుల కెలకుల ముత్యపు జల్లుల చేర్పుల ।
వొద్దికలాగులివేమో ఊహింపరే చెలులు ।
గద్దరి తిరువేంకటపతి కొగిటియధరామృతముల ।
అద్దిన సురతపు చెమటల అందము కాదు కదా ॥

## కీర్తన : ఎండగాని నీడగాని

ఎండగాని నీడగాని యేమైనగాని
కొండల రాయడె మాకులదైవము ॥

తెలుగాని పాముగాని దేవపట్టయినగాని
గాలిగాని ధూళిగాని కానియేమైన ।
కాలకూటవిషమైనా గ్రక్కున మింగిన నాటి-
నీలవర్ణుడేమా నిజదైవము ॥

చీమగాని దోమగాని చెలది యేమైనగాని
గాముగాని నాముగాని కానియేమైన ।
పాములనిన్నిటి మ్రింగె బలుతేజిపై నెక్కు
ధూమకేతువేమో దొరదైవము ॥

పిల్లిగాని నల్లిగాని పిన్న యెలుకైన గాని
కల్లగని నల్లిగాని కానియేమైన ।
బల్లిదుడై వేంకటాద్రి పైనున్న యాతడి
మమ్మేల్ల కాలము నేలేటి యింటిదైవము ॥

## కీర్తన : గాలినే పోయ గలకాలము

గాలినే పోయ గలకాలము
తాలిమికి గొంతయు బొద్దులేదు ॥

అడుసు చొరనే పట్టె నటునిటు గాళ్ళు
గుడుగుకొననే పట్టె గలకాలము ।
ఒడలికి జీవుని కొడయడైనహరి
దడవగా గొంతయు బొద్దులేదు ॥

కలచి చిందనే పట్టె గడవగ నించగ బట్టె కలుషదేహపుబాధ గలకాలము ।
తలపోసి తనపాలి దైవమైన హరి
దలచగా గొంతయు బొద్దులేదు ।

శిరము ముడువబట్టె చిక్కుదియ్యగ బట్టె
గరిమల గపటాల గలకాలము ।
తిరువేంకటగిరి దేవుడైనహరి
దరిచేరా గొంతయు బొద్దులేదు ॥

## కీర్తన : గరుడ గమన

గరుడ గమన గరుడధ్వజ
నరహరి నమోనమో నమో ॥

కమలాపతి కమలనాభా
కమలజ జన్మకారణిక ।
కమలనయన కమలాప్తకుల
నమోనమో హరి నమో నమో ॥

జలధి బంధన జలధిశయన
జలనిధి మధ్య జంతుకల ।
జలధిజామాత జలధిగంభీర
హలధర నమో హరి నమో ॥

ఘనదివ్యరూప ఘనమహిమాంక
ఘనఘనా ఘనకాయ వర్ణ ।
అనఘ శ్రీవేంకటాధిపతేహం
నమో నమోహరి నమో నమో ॥

## కీర్తన : ఘనుడాతడే

ఘనుడాతడే మము గాచుగాక హరి
అనిశము నేమిక నతనికె శరణు ॥

యెవ్వని నాభిని యీ బ్రహ్మాదులు
యెవ్వడు రక్షకుడిన్నిటికి ।
యెవ్వని మూలము యీ సచరాచర
మవ్వల నివ్వల నతనికే శరణు ॥

పురుషోత్తముడని పొగడి రెవ్వరిని
కరి నెవ్వడు గాచె ।
ధర యెవ్వడెత్తి దనుజుల బొరిగొనె
అరుదుగ మేమిక నతనికె శరణు ॥

శ్రీసతి యెవ్వని జేరి వురమునను
భాసిల్లె నెవ్వడు పరమంబై ।
దాసుల కొరకై తగు శ్రీవేంకట
మాస చూపి నితడతనికె శరణు ॥

## కీర్తన : గోవిందాశ్రిత

గోవిందాశ్రిత గోకులబృందా ।
పావన జయజయ పరమానంద ॥

జగదభిరామ సహస్రనామ ।
సుగుణధామ సంస్తుతనామ ।
గగనశ్యామ ఘనరిపు భీమ ।
అగణిత రఘువంశాంబుధి సోమ ॥

జననుత చరణా శరణ్య శరణా ।
దనుజ హరణ లలిత స్వరణా ।
అనఘ చరణాయత భూభరణా ।
దినకర సన్నిభ దివ్యాభరణా ॥

గరుడ తురంగా కారోత్తుంగా ।
శరధి భంగా ఫణి శయనాంగా ।
కరుణాపాంగా కమల సంగా ।
వర శ్రీ వేంకట గిరిపతి రంగా ॥

Get Telugu books at http://greatertelugu.com

## కీర్తన : హరినామము కడు

హరినామము కడు నానందకరము
మరుగవో మరుగవో మరుగవో మనసా ||

నళినాక్షు శ్రీనామము
కలిదోషహరము కైవల్యము |
ఫలసారము బహుబంధ మోచనము
తలచవో తలచవో మనసా ||

నగధరు నామము నరకహరణము
జగదేకహితము సమ్మతము |
సగుణ నిర్గుణము సాక్షాత్కారము
పొగడవో పొగడవో పొగడవో మనసా ||

కడగి శ్రీవేంకటపతి నామము
ఒడి ఒడినే సంపత్కరము |
అడియాలం బిల నతి సుఖమూలము
తడవవో తడవవో తడవవో మనసా ||

## కీర్తన : హరి యవతార మీతడు

హరి యవతార మీతడు అన్నమయ్య ।
అరయ మా గురుడీతడు అన్నమయ్య ।

వైకుంఠ నాథుని వద్ద వడి పడు చున్న వాడు
ఆకరమై తాళ్ళపాక అన్నమయ్య ।
ఆకసపు విష్ణు పాదమందు నిత్యమై ఉన్న వాడు
ఆకడీకడ తాళ్ళపాక అన్నమయ్య ॥

ఈవల సంసార లీల ఇందిరేశుతో నున్న వాడు
ఆవటించి తాళ్ళపాక అన్నమయ్య ।
భావింప శ్రీ వేంకటేశు పదములందే యున్నవాడు
హావ భావమై తాళ్ళపాక అన్నమయ్య ॥

క్షీరాబ్ధిశాయి బట్టి సేవింపుచు నున్నవాడు
ఆరితేరి తాళ్ళపాక అన్నమయ్య ।
ధీరుడై సూర్యమండల తేజము వద్ద నున్నవాడు
ఆరీతుల తాళ్ళపాక అన్నమయ్య ॥

## కీర్తన : ఇప్పుడిటు కలగంటి

ఇప్పుడిటు కలగంటి నెల్లలోకములకు |
అప్పడగు తిరువేంకటాద్రీశు గంటి ||

అతిశయంబైన శేషాద్రిశిఖరము గంటి |
ప్రతిలేని గోపుర ప్రభలు గంటి |
శతకోటి సూర్య తేజములు వెలుగగ గంటి |
చతురాస్యు బొడగంటి చయ్యన మేల్కొంటి ||

కనకరత్న కవాట కాంతు లిరుగడగంటి |
ఘనమైన దీపసంఘములు గంటి |
అనుపమ మణీమయమ్మగు కిరీటము గంటి |
కనకాంబరము గంటి గ్రక్కన మేల్కొంటి ||

అరుదైన శంఖ చక్రాదు లిరుగడ గంటి |
సరిలేని యభయ హస్తము గంటి |
తిరువేంకటాచలాధిపుని జూడగ గంటి |
హరి గంటి గురు గంటి నంతట మేల్కొంటి ||

## కీర్తన : ఇతరులకు నిను

ఇతరులకు నిను నెరుగదరమా ॥
సతతసత్యవ్రతులు సంపూర్ణమోహవిర-
హితులెరుగుదురు నిను నిందిరారమణా ॥

నారీకటాక్షపటునారాచభయరహిత-
శూరులెరుగుదురు నిను జూచేటిచూపు ।
ఘోరసంసార సంకులపరిచ్ఛేదులగు-
ధీరులెరుగుదురు నీదివ్యవిగ్రహము ॥

రాగభోగవిదూర రంజితాత్ములు మహా-
భాగులెరుగుదురు నిను బ్రణుతించువిధము ।
ఆగమోక్తప్రకారాభిగమ్యులు మహా-
యోగులెరుగుదురు నీవుండేటివునికి ॥

పరమభాగవత పదపద్మసేవానిజా-
భరణు లెరుగుదురు నీపలికేటిపలుకు ।
పరగునిత్యానంద పరిపూర్ణమానస-
స్థిరు లెరుగుదురు నిను దిరువేంకటేశ ॥

## కీర్తన : ఇట్టి ముద్దులాడి

ఇట్టి ముద్దులాడి బాలు డేడవాడు వాని
బట్టి తెచ్చి పొట్టనిండ బాలు వోయరే ||

గామిడై పారితెంచి కాగెడి వెన్నెలలోన
చేమ పూవు కడియాల చేయి పెట్టి |
చీమ గుట్టెనని తన చెక్కిట గన్నీరు జార
వేమరు వాపోయే వాని వెడ్డు వెట్టరే ||

ముచ్చువలె వచ్చి తన ముంగ మురువుల చేయి
తచ్చెడి పెరుగులోన దగబెట్టి |
నొచ్చెనని చేయిదీసి నోర నెల్ల జొల్లుగార
వొచ్చెలి వాపోవువాని నూరడించరే ||

ఎప్పుడు వచ్చెనో మా యిల్లు చొచ్చి పెట్టెలోని
చెప్పరాని వుంగరాల చేయి పెట్టి |
అప్పడైన వేంకటాద్రి అసవాలకుడు గాన
తప్పకుండ బెట్టె (బట్టి) వాని తలకెత్తరే ||

రాగం: దేవగాంధారి

## కీర్తన : జయ జయ రామా

జయ జయ రామా సమరవిజయ రామా |
భయహర నిజభక్తపారీణ రామా ||

జలధిబంధించిన సౌమిత్రిరామా
సెలవిల్లువిరచినసీతారామా |
అలసుగ్రీవునేలినాయోధ్యరామా
కలిగి యజ్ఞముగాచేకౌసల్యరామా ||

అరిరావణాంతక ఆదిత్యకులరామా
గురుమౌనులను గానేకోదండరామా |
ధర నహల్యపాలిటిదశరథరామా
హరురాణినుతులలోకాభిరామా ||

అతిప్రతాపముల మాయామృగాంతక రామా
సుతకుశలవప్రియ సుగుణ రామా |
వితతమహిమలశ్రీవేంకటాద్రిరామా
మతిలోనబాయనిమనువంశరామా ||

## కీర్తన : జయలక్ష్మి వరలక్ష్మి

జయలక్ష్మి వరలక్ష్మి సంగ్రామ వీరలక్ష్మి ।
ప్రియురాలవై హరికిఁ బెరసితివమ్మా ॥

పాలజలనిధిలోని పసనైనమీఁగడ
మేలిమితామరలోని మించువాసన ।
నీలవర్ణునురముపై నిండిననిధానమవై
యేలేవు లోకములు మమ్మేలవమ్మా ॥

చందురుతోడఁ బుట్టిన సంపదలమెఱుఁగవో
కందువ బ్రహ్మలఁ గాచేకల్పవల్లి ।
అందినగోవిందునికి అండనే తోడునీడవై
వుందానవు మాఇంటనే వుండవమ్మా ॥

పదియారువన్నెలతో బంగారుపతిమ
చెదరనివేదములచిగురుఁబోడి ।
యెదుట శ్రీవేంకటేశునిల్లాలవై నీవు
నిదుల నిలిచేతల్లి నీవారమమ్మా ॥

రాగం: లలిత

## కీర్తన : కలిగెనిదె నాకు

కలిగెనిదె నాకు కైవల్యము
తొలుతనెవ్వరికి దొరకనిది ||

జయపురుషోత్తమ జయ పీతాంబర
జయజయ కరుణాజలనిధి |
దయ యెఱంగ నే ధర్మము నెఱగ నా
క్రియ యిది నీదివ్యకీర్తనమే ||

శరణము గోవింద శరణము కేశవ
శరణు శరణు శ్రీజనార్దన |
పరమ మెఱంగను భక్తి యెఱంగను
నిరతము నాగతి నీదాస్యమే ||

నమో నారాయణా నమో లక్ష్మీపతి
నమో పుండరీకనయనా |
అమిత శ్రీవేంకటాధిప యిదె నా
క్రమమెల్లను నీకయింకర్యమే ||

## కీర్తన : కంటి నఖిలాండ

కంటి నఖిలాండ తతి కర్తనధికుని గంటి ।
కంటి నఘములు వీడుకొంటి నిజమూర్తి గంటి ॥

మహనీయ ఘన ఫణామణుల శైలము గంటి ।
బహు విభవముల మంటపములు గంటి ।
సహజ నవరత్న కాంచన వేదికలు గంటి ।
రహి వహించిన గోపురములవె కంటి ॥

పావనంబైన పాపవినాశము గంటి ।
కైవశంబగు గగన గంగ గంటి ।
దైవికపు పుణ్యతీర్థములెల్ల బొడగంటి ।
కోవిదులు గొనియాడు కోనేరి గంటి ॥

పరమ యోగీంద్రులకు భావగోచరమైన ।
సరిలేని పాదాంబుజముల గంటి ।
తిరమైన గిరిచూపు దివ్యహస్తము గంటి ।
తిరు వేంకటాచలాధిపు జూడగంటి ॥

## కీర్తన : కంటి శుక్రవారము

కంటి శుక్రవారము గడియ లేడింట ।
అంటి అలమేల్మంగ అండనుండే స్వామిని ॥

సొమ్ములన్ని కడపెట్టి సొంపుతో గోణముగట్టి ।
కమ్మని కదంబము కప్పు కన్నీరు ।
చెమ్మతోను వేష్టువలు రొమ్ముతల మొలజుట్టి ।
తుమ్మెద మైచాయతోన నెమ్మదినుండే స్వామిని ॥

పచ్చకప్పురమే నూరిపసిడి గిన్నెలనించి ।
తెచ్చి శిరసాదిగ దిగనలది ।
అచ్చెరపడి చూడనందరి కనులకింపై ।
నిచ్చమల్లె పూవువలె నిటుతానుండే స్వామిని ॥

తట్టుపునుగే కూరిచిచట్టలు చేరిచినిప్పు ।
పట్టి కరిగించు వెండి పళ్యాలనించి ।
దట్టముగ మేను నిండపట్టించి దిద్ది ।
బిట్టు వేడుక మురియు చుండేబిత్తరి స్వామిని ॥

## కీర్తన : కిం కరిష్యామి

కిం కరిష్యామి కిం కరోమి బహుళ-
శంకాసమాధానజాడ్యం వహామి ||

నారాయణం జగన్నాథం త్రిలోకైక-
పారాయణం భక్తపావనమ్ |
దూరీకరోమ్యహం దురితదూరేణ సం-
సారసాగరమగ్నచంచలత్వేన ||

తిరువేంకటాచలాధీశ్వరం కరిరాజ- |
వరదం శరణాగతవత్సలమ్ |
పరమపురుషం కృపాభరణం న భజామి
మరణభవదేహాభిమానం వహామి||

## కీర్తన : కోడెకాడె వీడె వీడె

కోడెకాడె వీడె వీడె గోవిందుడు
కూడె ఇద్దరు సతుల గోవిందుడు ॥

గొల్లెతల వలపించె గోవిందుడు
కొల్లలాడె వెన్నలు గోవిందుడు ।
గుల్ల సంకుఁజక్రముల గోవిందుడు
గొల్లవారింట పెరిగె గోవిందుడు ॥

కోలచే పసులగాచె గోవిందుడు
కూలగుమ్మె కంసుని గోవిందుడు ।
గోలయై వేల కొండెత్తె గోవిందుడు
గూళెపుసతులఁ దెచ్చె గోవిందుడు ॥

కుందనపు చేలతోడి గోవిందుడు
గొందులు సందులు దూరె గోవిందుడు ।
కుందని శ్రీవేంకటాద్రి గోవిందుడు
గొందిఁ దోసె నసురల గోవిందుడు ॥

## కీర్తన : కొలని దోపరికి

కొలని దోపరికి గొబ్బిళ్ళో యదు ।
కుల స్వామికిని గొబ్బిళ్ళో ॥

కొండ గొడుగుగా గోవుల గాచిన ।
కొండొక శిశువునకు గొబ్బిళ్ళో ।
దండగంపు దైత్యుల కెల్లను తల ।
గుండు గండనికి గొబ్బిళ్ళో ॥

పాప విధుల శిశుపాలుని తిట్టుల ।
కోపగానికిని గొబ్బిళ్ళో ।
యేపున కంసుని యిడుమల బెట్టిన ।
గోప బాలునికి గొబ్బిళ్ళో ॥

దండివైరులను తరిమిన దనుజుల ।
గుండె దిగులునకు గొబ్బిళ్ళో ।
వెండిపైడి యగు వేంకట గిరిపై ।
కొండలయ్యకును గొబ్బిళ్ళో ॥

## కీర్తన : కొలిచిన వారల

కొలిచిన వారల కొంగుపైడితడు ।
బలిమి తారక బ్రహ్మమీతడు ॥

ఇనవంశాంబుధి నెగసిన తేజము ।
ఘనయజ్ఞంబుల గల ఫలము ।
మనుజరూపమున మనియెడి బ్రహ్మము ।
నినువుల రఘుకుల నిధానమీతడు ॥

పరమాన్నములోపలి సారపుజవి ।
పరగినదివిజుల భయహరము ।
మరిగినసీతా మంగళసూత్రము ।
ధరలో రామావతారంబితడు ॥

చకితదానవుల సంహారచక్రము ।
సకల వనచరుల జయకరము ।
వికసితమగు శ్రీవేంకట నిలయము ।
ప్రకటిత దశరథ భాగ్యంబితడు ॥

## కీర్తన : క్షీరాబ్ధి కన్యకకు

క్షీరాబ్ధి కన్యకకు శ్రీ మహాలక్ష్మికిని
నీరజాలయమునకు నీరాజనమ్ ॥

జలజాక్షి మోమునకు జక్కవ కుచంబులకు
నెలకొన్న కప్పురపు నీరాజనమ్ ।
అలివేణి తురుమునకు హస్తకమలంబులకు
నిలువుమాణిక్యముల నీరాజనమ్ ॥

చరణ కిసలయములకు సకియరంభోరులకు
నిరతమగు ముత్తేల నీరాజనమ్ ।
అరిది జఘనంబునకు అతివనిజనాభికిని
నిరతి నానావర్ణ నీరాజనమ్ ॥

పగటు శ్రీవేంకటేశు పట్టపురాణియై
నెగడు సతికళలకును నీరాజనమ్ ।
జగతి నలమేల్మంగ చక్కదనములకెల్ల
నిగుడు నిజ శోభనపు నీరాజనమ్ ॥

## కీర్తన : కులుకక నడవరో

కులుకక నడవరో కొమ్మలాలా |
జలజల రాలీని జాజులు మాయమ్మకు ||

ఒయ్యనే మేను గదలి నొప్పుగా నడవరో
గయ్యాళి శ్రీపాదతాకు కాంతులాలా |
పయ్యెద చెఱగు జారీ భారపు గుబ్బల మిద
అయ్యో చెమరించె మా యమ్మకు నెన్నుదురు ||

చల్లెడి గందవొడియై జారీ నిలువరో
పల్లకి వట్టిన ముద్దు బణతులాల |
మొల్లమైన కుందనపు ముత్యాల కుచ్చులదర
గల్లనుచు గంకణాలు గదలీమాయమ్మకు ||

జమళి ముత్యాల తోడి చమ్మాళిగ లిడరో
రమణికి మణుల నారతు లెత్తరో |
అమరించి కౌగిట నలమేలు మంగనిదె
సమకూడె వేంకటేశ్వరుడు మా యమ్మకు ||

రాగం: దేసాళం

## కీర్తన : లాలి శ్రీ క్రిష్ణయ్య

లాలి శ్రీ క్రిష్ణయ్య నీల మేఘువర్ణ
నవ నీల మేఘువర్ణ
బాలగోపాలపాల పవ్వళింపరా

సింగారించిన మంచి బంగారు ఊయలలోన
మరి బంగారు ఊయలలోన
శంఖు చక్రధరస్వామి నిదురపోరా

లలితాంగి రుక్మిణీ లలనాయె కావలెనా
నీకు లలనాయె కావలెనా
పలుకు కోయిల సత్యభామయె కావలెనా

అందెలూ మువ్వలూ సందడిగ మ్రోయగను
అతి సందడిగ మ్రోయగను
అందముగాను నీవు పవ్వలింపరా

పగడాల పతకాలు కంఠనా ధరియించి
నీ కంఠనా ధరియించి
వంగేవు తొంగేవు నిదురపోరా

అలుకలు పోనెల అలవేలు మంగతో
శ్రీ అలవేలు మంగతో
కులుకుచు శయ్యనించు వెంకటేశ్వరుడా

## కీర్తన : మచ్చ కూర్మ వరాహ

మచ్చ కూర్మ వరాహ మనుష్య సింహ వామనా
యిచ్చ రామ రామ రామ హిత బుద్ధ కలికీ ||

నన్నుగావు కేశవ నారాయణ మాధవ
మన్నించు గోవింద విష్ణు మధుసూదన |
వన్నెల త్రివిక్రమ వామనా శ్రీధరా
సన్నుతించే హృషికేశ సారకు పద్మనాభ ||

కంటిమి దామోదర సంకర్షణ వాసుదేవ
అంటేజాలు ప్రద్యుమ్నుడా అనిరుద్ధుడా |
తొంటే పురుషోత్తమ అధోక్షజా నారసింహమా
జంటవాయుకు మచ్యుత జనార్దన ||

మొక్కేము వుపేంద్ర హరి మోహన శ్రీకృష్ణరాయ
యెక్కితి శ్రీవేంకట మిందిరానాథ |
యిక్కువ నీ నామములు యివియే నా జపములు
చక్కగా నీ దాసులము సర్వేశ అనంత ||

## కీర్తన : మహినుద్యోగి కావలె

మహినుద్యోగి కావలె మనుజుడైన వాడు |
సహజి వలె నుండి ఏమి సాధించలెడు ||

వెదకి తలచుకుంటే విష్ణుడు కానవచ్చు |
చెదరి మరచితే సృష్టి చీకటౌ |
పొదలి నడిచితేను భూమెల్లా మెట్టి రావచ్చు |
నిదురించితే కాలము నిమిషమై తోచు ||

వేడుకతో చదివితే వేదశాస్త్ర సంపన్నుడౌ |
జాడతో నూరకుండితే జడుడౌను |
వోడక తపసియైతే వున్నతోన్నతుడౌ |
కూడక సోమరి ఐతే గుణహీనుడౌను ||

మురహరు గొలిచితే మోక్షము సాధించవచ్చు |
వెరవెరగక ఉండితే వీరిడియౌను |
శరణంటే శ్రీవేంకటేశ్వరుడు రక్షించును |
పరగ సంశయించితే పాషండుడౌను ||

## కీర్తన : మంగాంబుధి హనుమంతా

మంగాంబుధి హనుమంతా నీ శరణ ।
మంగవించితిమి హనుమంతా ॥

బాలార్క బింబము ఫలమని ప ట్టిన
ఆలరి చేతల హనుమంతా ।
తూలని బ్రహ్మాదులచే వరములు
ఓలి చేకొనినా హనుమంతా ॥

జలధి దాట నీ సత్వము కపులకు
అలరి తెలిపితివి హనుమంతా ।
ఇలయు నాకసము నేకముగా, నటు
బలిమి పెరిగితివి భళి హనుమంతా ॥

పాతాళము లోపలి మైరావణు
ఆతల జంపిన హనుమంతా ।
చేతులు మోడ్చుక శ్రీ వేంకటపతి
నీ తల గోలిచే హిత హనుమంతా ॥

రాగం: ధర్మవతి

తాళం: ఆది

## కీర్తన : మేదిని జీవుల గావ

మేదిని జీవుల గావ మేలుకోవయ్యా |
నీదయే మాకెల్ల రక్ష నిద్ర మేలుకోవయ్యా ||

తగుగోపికల కన్నుదామరలు వికసించె
మిగుల సూర్యనేత్రుడ మేలుకోవయ్యా |
తెగువ రాక్షసులనే తిమిరము విరియగ
నెగడిన పరంజ్యోతి నిద్ర మేలుకోవయ్యా ||

ఘనదురితపు గలువలు వికసించె
మినుకు శశినేత్రుడ మేలుకోవయ్యా |
పనివడి వేదాలనే పక్షులెల్లా బలుకగ
జనక! యాశ్రితపారిజాత మేలుకోవయ్యా ||

వరలక్ష్మి కుచచక్రవాకము లొండొంటి రాయ
మెరయుదోషరహిత మేలుకోవయ్యా |
పొరసి నీవు నిత్యభోగములు భోగించ
నిరతి శ్రీవేంకటేశ నేడు మేలుకోవయ్యా ||

## కీర్తన : మేలుకో శృంగారరాయ

మేలుకో శృంగారరాయ మేటి మదనగోపాల ।
మేలుకోవె నాపాల ముంచిన నిధానమా ॥

సందడిచే గోపికల జవ్వనవనములోన ।
కందువందిరిగే మదగజమవు ।
యిందుముఖి సత్యభామ హృదయ పద్మములోని ।
గంధము మరిగినట్టి గండు తుమ్మెద ॥

గతిగూడి రుక్మిణికౌగిట పంజరములో ।
రతిముద్దు గురిసేటి రాచిలుకా ।
సతుల పదారువేల జంట కన్నుల గలువల- ।
కితమై పొడిమిన నా యిందు బింబమ ॥

వరుసం గొలనిలోని వారి చన్నుంగొండలపై ।
నిరతి వాలిన నా నీలమేఘమా ।
శిరనురమున మోచి శ్రీ వేంకటాద్రి మీద ।
గరిమ వరాలిచ్చే కల్పతరువా ॥

## కీర్తన : ముద్దుగారే యశోద

ముద్దుగారే యశోద ముంగిటి ముత్యము వీడు ।
తిద్దరాని మహిమల దేవకీ సుతుడు ॥

అంత నింత గొల్లెతల అరచేతి మాణిక్యము ।
పంత మాడే కంసుని పాలి వజ్రము ।
కాంతుల మూడు లోకాల గరుడ పచ్చ బూస ।
చెంతల మాలో నున్న చిన్ని కృష్ణుడు ॥

రతికేళి రుక్మిణికి రంగు మోవి పగడము ।
మితి గోవర్ధనపు గోమేధికము ।
సతమై శంఖ చక్రాల సందుల వైడూర్యము ।
గతియై మమ్ము గాచేటి కమలాక్షుడు ॥

కాళింగుని తలలపై గప్పిన పుష్యరాగము ।
యేలేటి శ్రీ వేంకటాద్రి యింద్రనీలము ।
పాల జలనిధి లోన బాయని దివ్య రత్నము ।
బాలునివలె దిరిగీ బద్మ నాభుడు ॥

రాగం: సాళంగనాట

## కీర్తన : నగవులు నిజమని

నగవులు నిజమని నమ్మేదా ।
వొగినడియాసలు వొద్దనవే ॥

తొల్లిటి కర్మము దొంతల నుండగ ।
చెల్లబోయిక జేసేదా ।
యెల్ల లోకములు యేలేటి దేవుడ ।
వొల్ల నొల్లనిక నొద్దనవే ॥

పోయిన జన్మము పొరుగులనుండగ ।
చేయనక యిందు జెలగేదా ।
వేయినామముల వెన్నుడమాయలు ।
ఓ యయ్య యింక నొద్దనవే ॥

నలి నీనామము నాలికనుండగ ।
తలకొని యితరము దడవేదా ।
బలు శ్రీ వేంకటపతి నిన్నుగొలిచి ।
వొలుకు చంచలము లొద్దనవే ॥

## కీర్తన : ల్లని మేని నగవు

నల్లని మేని నగవు చూపుల వాడు |
తెల్లని కన్నుల దేవుడు ||

బిరుసైన దనుజుల పించమణచినట్టి |
తిరుపు కైదువ తోడి దేవుడు |
సరిపడ్డ జగమెల్ల చక్క ఛాయకు దెచ్చి |
తెరవు చూపినట్టి దేవుడు ||

నీటుగలసినట్టి నిండిన చదువులు |
తేట పరచినట్టి దేవుడు |
పాటిమాలినట్టి ప్రాణుల దురితపు |
తేట రాసినట్టి దేవుడు ||

గురుతువెట్టగరాని గుణముల నెలకొన్న |
తిరువేంకటాద్రిపై దేవుడు |
తిరముగ ధృవునికి దివ్యపదంబిచ్చి |
తెరచి రాజన్నట్టి దేవుడు ||

## కీర్తన : నారాయణాచ్యుతానంత

నారాయణాచ్యుతానంత గోవింద హరి ।
సారముగ నీకునే శరణంటిని ॥

చలువయును వేడియును నటల సంసారంబు
తొలకు సుఖమొకవేళ దుఃఖమొకవేళ ।
ఫలములివె యీ రెండు పాపములు పుణ్యములు
పులుసు దీపును గలపి భుజియించినట్లు ॥

పగలు రాత్రులరీతి బహుజన్మ మరణాలు
తగుమేను పొడచూపు తనుదానె తొలగు ।
నగియించు నొకవేళ నలగించు నొకవేళ
వొగరు కారపు విడెము ఉబ్బించినట్లు ॥

యిహము పరమును వలెనె యెదిటికల్లయు నిజము
విహరించు భ్రాంతియును విభ్రాంతియును మతిని ।
సహజ శ్రీ వేంకటేశ్వర నన్ను కరుణింప
బహువిధంబుల నన్ను పాలించవే ॥

## కీర్తన : నారాయణాయ నమో నమో

నారాయణాయ నమో నమో నానాత్మనే నమో నమో
యిారచనలనే యెవ్వరు దలచిన యిహపర మంత్రము లిందరికి ||

గోవిందాయ నమో నమో గోపాలాయ నమో నమో
భావజగురవే నమో నమో ప్రణవాత్మనే నమో నమో |
దేవేశాయ నమో నమో దివ్యగుణాయ నమో యనుచు
యిావరుసలనే యెవ్వరు దలచిన యిహపర మంత్రము లిందరికి ||

దామోదరాయ నమో నమో ధరణీశాయ నమో నమో
శ్రీమహిళాపతయే నమో శిష్టరక్షిణే నమో నమో |
వామనాయ తే నమో నమో వనజాక్షాయ నమో నమో
యిామేరలనే యెవ్వరు దలచిన యిహపర మంత్రము లిందరికి ||

పరిపూర్ణాయ నమో నమో ప్రణవాగ్రాయ నమో నమో
చిరంతన శ్రీ వేంకటనాయక శేషశాయినే నమో నమో |
నరకధ్వంసే నమో నమో నరసింహాయ నమో నమో
యిరవుగ నీగతి నెవ్వరు దలచిన యిహపర మంత్రము లిందరికి ||

## కీర్తన : నవనీతచోర

నవనీతచోర నమో నమో
నవమహిమార్ణవ నమో నమో ||

హరి నారాయణ కేశవాచ్యుత శ్రీకృష్ణ
నరసింహ వామన నమో నమో |
మురహర పద్మ నాభ ముకుంద గోవింద
నరనారాయణరూప నమో నమో ||

నిగమగోచర విష్ణు నీరజాక్ష వాసుదేవ
నగధర నందగోప నమో నమో |
త్రిగుణాతీత దేవ త్రివిక్రమ ద్వారక
నగరాధినాయక నమో నమో ||

వైకుంఠ రుక్మిణీవల్లభ చక్రధర
నాకేశవందిత నమో నమో |
శ్రీకరగుణనిధి శ్రీ వేంకటేశ్వర
నాకజననమత నమో నమో ||

## కీర్తన : నవరసములదీ

నవరసములదీ నళినాక్షి ।
జవకట్టి నీకు జవి సేసీని ॥

శృంగార రసము చెలియ మొకంబున ।
సంగతి వీరరసము గోళ్ళ ।
రంగగు కరుణరసము పెదవులను ।
అంగపు గుచముల నద్భుత రసము ॥

చెలి హాస్యరసము చెలవుల నిండీ ।
పలుచని నడుమున భయరసము ।
కలికి వాడుగన్నుల భీభత్సము ।
అల బొమ జంకెనల నదె రౌద్రంబు ॥

రతి మరపుల శాంతరసంబదె ।
అతి మోహము పదియవరసము ।
ఇత్వుగ శ్రీవేంకటేశ కూడితివి ।
సతమై యీపెకు సంతోస రసము ॥

## కీర్తన : నెలమూడు శోభనాలు

నెలమూడు శోభనాలు నీకు నతనికిదగు |
కలకాలమును నిచ్చకల్యాణమమ్మా ||

రామనామమతనిది రామవు నీవైతేను |
చామన వర్ణమతడు చామవు నీవు |
వామనుడందురతని వామనయనవు నీవు |
ప్రేమపుమీ యిద్దరికి పేరుబలమొకటే ||

హరి పేరాతనికి హరిణేక్షణవు నీవు |
కరిగాచెదాను నీవు కరియానవు |
సరి జలధిశాయి జలధికన్యవు నీవు |
బెరసి మీయిద్దరికి బేరుబలమొకటే ||

జలజ నాభుడతడు జలజముఖివి నీవు |
అలమేలుమంగవు నిన్నెలమెదాను |
ఇలలో శ్రీవేంకటేశుడిటు నిన్నురానమోచె |
పిలిచి పేరుచెప్పెబేరుబలమొకటే ||

## కీర్తన : నిగమనిగమాంతవర్ణిత

నిగమనిగమాంతవర్ణిత మనోహర రూప-
నగరాజధరుడ శ్రీనారయణా ||

దీపించు వైరాగ్యదివ్య సౌఖ్యం బియ్య-
నోపకరా నన్ను నొడబరపుచు |
పైపైనె సంసారబంధముల గట్టేవు
నాపలుకు చెల్లునా నారాయణా ||

చికాకుపడిన నా చిత్తశాంతము సేయ-
లేకకా నీవు బహులీల నన్ను |
కాకుసేసెదవు బహుకర్మల బడువారు
నాకొలదివారలా నారాయణా ||

వివివిధ నిర్బంధముల వెడలద్రోయక నన్ను
భవసాగరముల నడబడ జేతురా |
దివిజేంద్రవంద్య శ్రీ తిరువేంకటాద్రీశ
నవనీత చోర శ్రీనారాయణా ||

## కీర్తన : నిముషమెడతెగక

నిముషమెడతెగక హరి నిన్ను తలచి ।
మమత నీ మీదనే మరపి బ్రతుకుటగాక ॥

నిదురచే కొన్నాళ్ళు నేరముల కొన్నాళ్ళు
ముదిమిచే కొన్నాళ్ళు మోసపోయి ।
కదిసి కోరినను గతకాలంబు వచ్చునే
మది మదినె యుండి ఏమరక బతుకుట గాక ॥

కడు తనయులకు కొంత కాంతలకు నొక కొంత
వెడయాసలకు కొంత వెట్టిసేసి ।
అడరి కావలెననిన అందు సుఖమున్నదా
చెడక నీ సేవలే సేసి బతుకుటగాక ॥

ధనము వెంట తగిలి ధాన్యంబునకు తగిలి
తనవారి తగిలి కాతరుడైనను ।
కను కలిగి శ్రీ వేంకటనాథ కాతువే
కొనసాగి నిన్ననే కొలిచి బతుకుటగాక ॥

## కీర్తన : నిత్య పూజలివిగో

నిత్య పూజలివిగో నెరిచిన నోహో ।
ప్రత్యక్షమైనట్టి పరమాత్మునికి నిత్య పూజలివిగో ॥

తనువే గుడియట తలయె శిఖరమట
పెను హృదయమే హరి పీఠమట ।
కనుగొన చూపులే ఘన దీపములట
తన లోపలి అంతర్యామికిని ॥

పలుకే మంత్రమట పాదయిన నాలుకే
కలకల మను పిడి ఘంటయట ।
నలువైన రుచులే నైవేద్యములట
తలపులోపలనున్న దైవమునకు ॥

గమన చేష్టలే అంగరంగ గతియట
తమి గల జీవుడే దాసుడట ।
అమరిన ఊర్పులే ఆలబట్టములట
క్రమముతో శ్రీ వెంకటరాయునికి ॥

## కీర్తన : ఒకపరి కొకపరి

ఒకపరి కొకపరి కొయ్యారమై ।
మొకమున కళలెల్ల మొలచినట్లుండె ॥

జగదేకపతిమేన చల్లిన కర్పూరధూళి ।
జిగికొని నలువంక చిందగాను ।
మొగి చంద్రముఖి నురమున నిలిపెగాన ।
పొగరు వెన్నెల దిగబోసి నట్లుండె ॥

పొరిమెరుగు చెక్కుల పూసిన తట్టుపునుగు ।
కరగి ఇరుదెసల కారగాను ।
కరిగమన విభుడు గనుక మోహమదము ।
తొరిగి సామజసిరి తొలికినట్లుండె ॥

మెరయ శ్రీవేంకటేశుమేన సింగారముగాను ।
తరచైన సొమ్ములు ధరియించగా ।
మెరుగు బోడి అలమేలు మంగయు తాను ।
మెరుపు మేఘము గూడి మెరసినట్లుండె ॥

## కీర్తన : పలుకు దేనెల తల్లి

పలుకు దేనెల తల్లి పవళించెను ।
కలికి తనముల విభుని గలసినది గాన ॥

నిగనిగని మోముపై నెఱులు గెలకుల జెదర
పగలైన దాక జెలి పవళించెను ।
తెగని పరిణతులతో తెల్లవారినదాక
జగదేక పతి మనసు జట్టి గొనె గాన ॥

కొంగు జారిన మెఱుగు గుబ్బ లొలయగ దరుణి
బంగారు మేడపై బవళించెను ।
చెంగలువ కనుగొనల సింగారములు దొలక
అంగజ గురునితోడ నలసినదిగాన ॥

మురిపెంపు నటనతో ముత్యాల మలగుపై
పరవశంబున దరుణి పవళించెను ।
తిరు వేంకటాచలా ధిపుని కౌగిట గలసి
అరవిర్సై నును జెమలు నంటినదిగాన ॥

రాగం: సాళంగనాట

## కీర్తన : ఓ పవనాత్మజ

ఓ పవనాత్మజ ఓ ఘనుడా
బాపు బాపనగా పరిగితిగా ।

ఓ హనుమంతుడ ఉదయాచల ని-
ర్వాహక నిజ సర్వ ప్రబలా ।
దేహము మోచిన తెగువకు నిటువలె
సాహస మిటువలె చాటితిగా ॥

ఓ రవి గ్రహణ ఓదనుజాంతక
మారులేక మతి మలసితిగా ।
దారుణపు వినతా తనయాదులు
గారవింప నిటు కలిగితిగా ॥

ఓ దశముఖ హర ఓ వేంకటపతి-
పాదసరోరుహ పాలకుడా ।
ఈ దేహముతో ఇన్నిలోకములు
నీదేహమెక్క నిలిచితిగా ॥

## కీర్తన : పెరిగినాడు చూడరో

పెరిగినాడు చూడరో పెద్ద హనుమంతుడు |
పరగి నానా విద్యల బలవంతుడు ||

రక్కసుల పాలికి రణరంగ శూరుడు
వెక్కసపు ఏకాంగ వీరుడు |
దిక్కులకు సంజీవి తెచ్చిన ధీరుడు
అక్కజమైనట్టి ఆకారుడు ||

లలిమీరిన యట్టి లావుల భీముడు
బలు కపికుల సార్వభౌముడు |
నెలకొన్న లంకా నిర్ధూమధాముడు
తలపున శ్రీరాము నాత్మారాముడు ||

దేవకార్యముల దిక్కువరేణ్యుడు
భావింపగల తపః ఫల పుణ్యుడు |
శ్రీవేంకటేశ్వర సేవాగ్రగణ్యుడు
సావధానుడు సర్వశరణ్యుడు ||

## కీర్తన : ఫాలనేత్రానల

ఫాలనేత్రానల ప్రబల విద్యుల్లతా
కేళీ విహార లక్ష్మీనారసింహా ॥

ప్రళయమారుత ఘోర భస్త్రీకాపూత్కార
లలిత నిశ్వాసడోలా రచనయా ।
కూలశైలకుంభినీ కుముదహిత రవిగగన-
చలన విధినిపుణ నిశ్చల నారసింహా ॥

వివరఘనవదన దుర్విధహసన నిష్ఠ్యూత-
లవదివ్య పరుష లాలాఘుటనయా ।
వివిధ జంతు వ్రాతభువన మగ్నీకరణ
నవనవప్రియ గుణార్ణవ నారసింహా ॥

దారుణోజ్జ్వల ధగద్ధగిత దంష్ట్రానల వి-
కార స్ఫులింగ సంగక్రీడయా ।
వైరిదానవ ఘోరవంశ భస్మీకరణ-
కారణ ప్రకట వేంకట నారసింహా ॥

## కీర్తన : పిడికిట తలంబ్రాల

పిడికిట తలంబ్రాల పెండ్లి కూతురు కొంత ।
పడమరలి నవ్వీనె పెండ్లి కూతురు ॥

పేరుకల జవరాలె పెండ్లి కూతురు పెద్ద ।
పేరుల ముత్యాల మేడ పెండ్లి కూతురు ।
పేరంటాండ్ల నడిమి పెండ్లి కూతురు విభు ।
పేరుకుచ్చు సిగ్గువడీ బెండ్లి కూతురు ॥

బిరుదు పెండము వెట్టె బెండ్లి కూతురు నెర ।
బిరుదు మగని కంటె బెండ్లి కూతురు ।
పిరిదూరి నప్పుడే పెండ్లి కూతురూ పతి ।
బెరరేచీ నిదివో పెండ్లి కూతురు ॥

పెట్టెనే పెద్ద తురుము పెండ్లి కూతురు నేడె ।
పెట్టెడు చీరలు గట్టి పెండ్లి కూతురు ।
గట్టిగ వేంకటపతి కౌగిటను ।
పెట్టిన నిధానమయిన పెండ్లి కూతురు ॥

## కీర్తన : పొడగంటిమయ్య మిమ్ము

పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా మమ్ము
నెడయకవయ్య కోనేటి రాయడా ॥

కోరిమమ్ము నేలినట్టి కులదైవమా, చాల
నేరిచి పెద్దలిచ్చిన నిధానమా ।
గారవించి దప్పిదీర్చు కాలమేఘుమా, మాకు
చేరువజిత్తములోని శ్రీనివాసుడా ॥

భావింప గైవసమైన పారిజాతమా, మమ్ము
చేవదేర గాచినట్టి చింతామణీ ।
కావించి కోరికలిచ్చే కామధేనువా, మమ్ము
తావై రక్షించేటి ధరణీధరా ॥

చెడనీక బ్రతికించే సిద్ధమంత్రమా, రోగా
లడచి రక్షించే దివ్యౌషధమా ।
బడిబాయక తిరిగే ప్రాణబంధుడా, మమ్ము
గడియించినట్టి శ్రీ వేంకటనాథుడా ॥

రాగం:అట్టతాళం

## కీర్తన : పుట్టుభోగులము మేము

పుట్టుభోగులము మేము భువి హరిదాసులము ।
నట్టనడిమి దొరలు నాకియ్యవలెనా ॥

పల్లకీలు నందనాలు పడివాగె తేజీలు
వెల్లవిరి మహాలక్ష్మి విలాసములు ।
తల్లియాకె మగనినే దైవమని కొలిచేము
వొల్లగే మాకే సిరులు వొరులియ్యవలెనా ॥

గ్రామములు వస్త్రములు గజముఖ్య వస్తువులు
ఆమని భూకాంతకు నంగభేదాలు ॥
భామిని యాకె మగని ప్రాణధారి లెంక-
లము వోలి మాకాతడే యిచ్చీ వొరులియ్యవలెనా ॥

పసగల పదవులు బ్రహ్మ నిర్మితములు
వెస బ్రహ్మతండ్రి శ్రీ వేంకటేశుడు ।
యెసగి యాతడే మమ్మునేలి యిన్నియు నిచ్చె
వొసగిన మాసొమ్ములు వొరులియ్యవలెనా ॥

## కీర్తన : రాజీవ నేత్రాయ

రాజీవ నేత్రాయ రాఘవాయ నమో |
సౌజన్య నిలయాయ జానకీశాయ ||

దశరథ తనూజాయ తాటక దమనాయ
కుశిక సంభవ యజ్ఞ గోపనాయ |
పశుపతి మహా ధనుర్భంజనాయ నమో
విశద భార్గవరామ విజయ కరుణాయ ||

భరిత ధర్మాయ శుర్పణఖాంగ హరణాయ
ఖరదూషణాయ రిపు ఖండనాయ |
తరణి సంభవ సైన్య రక్షకాయనమో
నిరుపమ మహా వారినిధి బంధనాయ ||

హత రావణాయ సంయమి నాథ వరదాయ
అతులిత అయోధ్యా పురాధిపాయ |
హితకర శ్రీ వేంకటేశ్వరాయ నమో
వితత వావిలిపాటి వీర రామాయ ||

## కీర్తన : రాముడు లోకాభిరాముడు

రాముడు లోకాభిరాముడు త్రైలోక్య
ధాముడు రణరంగ భీముడు వాడే ||

వరుడు సీతకు, ఫలాధరుడు మహోగ్రపు
శరుడు రాక్షస సంహరుడు వాడే |
స్థిరుడు సర్వగుణాకరుడు కోదండ దీక్షా
గురుడు సేవకశుభకరుడు వాడే ||

ధీరుడు లోకైకవీరుడు సకలా
ధారుడు భవబంధదూరుడు వాడే |
శూరుడు ధర్మవిచారుడు రఘువంశ
సారుడు బ్రహ్మసాకారుడు వాడే ||

బలుడు యిన్నిటా రవికులుడు భావించ, ని
ర్మలుడు నిశ్చలుడవికలుడు వాడే |
వెలసి శ్రీ వేంకటాద్రి నిజనగరములోన
తలకొనె పుణ్యపాదతలుడు వాడే ||

## కీర్తన : రాముడు రాఘవుడు

రాముడు రాఘవుడు రవికులు డితడు ।
భూమిజకు పతియైన పురుష నిధానము ॥

అరయ పుత్రకామేష్టి యందు పరమాన్నమున ।
పరగ జనించిన పర బ్రహ్మము ।
సురల రక్షింపగ అసురుల శిక్షింపగ ।
తిరమై ఉదయించిన దివ్య తేజము ॥

చింతించే యోగీంధ్రుల చిత్త సరోజములలో ।
సంతతము నిలిచిన సాకారము ।
వింతలుగా మునులెల్ల వెదకిన యట్టి ।
కాంతుల చెన్ను మీరిన కైవల్య పదము ॥

వేద వేదాంతములయందు విజ్ఞాన శాస్త్రములందు ।
పాదుకొన పలికేటి పరమార్థము ।
ప్రోదితో శ్రీ వేంకటాద్రి పొంచి విజయ నగరాన ।
ఆదికి అనాదియైన అర్చావతారము ॥

రాగం: కానడ

## కీర్తన : రాధామాధవరతిచరితమితి

రాధామాధవరతిచరితమితి
బోధావహం శ్రుతిభూషణమ్ ||

గహనే ద్వావపి గత్వా గత్వా
రహసి రతిం ప్రేరయతి సతి |
విహరతస్తదా విలసంతౌ
విహతగృహాశౌ వివశౌ తౌ ||

లజ్జాశభళ విలాసలీలయా
కజ్జలనయన వికారేణ |
హృజ్జావ్యవనహిత హృదయా రతి
స్సజ్జా సంభ్రమచపలా జాతా ||

పురతో యాంతం పురుషం వకుళైః
కురంటకైర్వా కుటజైర్వా |
పరమం ప్రహరతి పశ్చాల్లగ్నా-
గిరం వినాపి వికిరతి ముదమ్ ||

హరి సురభూరుహ మారోహతీవ
చరణేన కటిం సంవేష్ట్య |
పరిరంచణ సంపాదితపులకై
స్సురుచిర్జాతా సుమలతికేవ ||

విధుముఖదర్శన వికళితలజ్జా-
త్వధరబింబఫలమాస్వాద్య |

Get Telugu books at http://greatertelugu.com

మధురోపాయనమార్గేణ కుచౌ
నిధివద త్వా నిత్యసుఖమితా ||

సురుచిరకేతక సుమదళ నఖరై-
ర్వరచిబుకం సా పరివృత్య |
తరుణిమసింధౌ తదీయదృగ్గల-
చరయుగళం సంసక్తం చకార ||

వచన విలాసైర్వశీకృత తం
నిచులకుంజ మానితదేశే |
ప్రచురసైకతే పల్లవశయనే-
రచితరతికళా రాగేణాస ||

అభినవకల్యాణాంచితరూపా-
వభినివేశ సంయతచిత్తా |
బభూవతు స్తత్పరౌ వేంకట
విభునా సా తద్విధినా సతయా ||

సచ లజ్జావీక్షణో భవతి తం
కచభరాం గంధం ఘ్ర◌ాపయతి |
నచలతిచేన్మానవతీ తథాపి
కుచసంగాదనుకూలయతి ||

అవనతశిరసాప్యతి సుభగం
వివిధాలాపైర్వివశయతి |
ప్రవిమల కరరుహరచన విలాసై
ర్భువనపతి తం భూషయతి ||

లతాగృహమేళనం నవస్సై
కతవైభవ సౌఖ్యం దృష్ట్వా ।
తతస్తతశ్చరసౌ కేలీ-
వ్రతచర్యాం తాం వాంఛంతౌ ।

వనకుసుమ విశదవరవాసనయా-
ఘనసారరజోగంధైశ్చ ।
జనయతి పవనే సపది వికారం-
వనితా పురుషౌ జనితాశౌ ॥

ఏవం విచరన్ హేలా విముఖ-
శ్రీవేంకటగిరి దేవోయమ్ ।
పావనరాధాపరిరంభసుఖ-
శ్రీ వైభవసుస్థిరో భవతి ॥

## కీర్తన : రంగ రంగ రంగ పతి

రంగ రంగ రంగ పతి రంగనాధా నీ |
సింగారాలె తరచాయ శ్రీ రంగ నాధా ||

పట్టి పగలే మాతో పలుచగ నవ్వేవు |
ఒట్టులేల టలిగిరించు వడి నీ మాటలు వింటె |
రట్టుడివి మేరమీరకు రంగనాధా |
రంగనాధా శ్రీ రంగనాధా ||

కావేటి రంగమున కాంతపై పాదాలు సాచి |
రావు పోవు ఎక్కడికి రంగ నాధా |
శ్రీ వేంకటాద్రి మీద చేరి నను కూడితివి |
ఏవల చూచిన నీవేయిట రంగనాధా ||

రాగం: సింధు భైరవ

## కీర్తన : సకలం హేసఖి

సకలం హేసఖి జానామె తత్
ప్రకత విలాసం పరమం దధసే ||

అలిక మృగ మద మయ మషి
కలనౌ జ్వలతాహే సఖి జానామే |
లలితం తవ పల్లవి తమనసి ని-
స్చలతర మేఘ శ్యామం దధసే ||

చారుకపోల స్థల కరాంకిత
విచారం హే సఖి జానామే |
నారయణ మహినాయక శయనం
శ్రిరమనం తవ చిత్తే దధసే ||

ఘన కుచ శైల క్రస్చిత విభుమని
జననం హే సఖి జానామే |
కనతురస వేంకట గిరిపతి
వినుత భొగ సుఖ విభవం దధసే ||

## కీర్తన : సర్వాంతరాత్ముడవు

సర్వాంతరాత్ముడవు శరణాగతుడ నేను |
సర్వాపరాధినైతి చాలుజాలునయ్యా ||

వూరకున్నజీవునికి వొక్కొక్క స్వతంత్రమిచ్చి |
కోరేటియపరాధాలు కొన్ని వేసి |
నేరకుంటే నరకము నేరిచితే స్వర్గమంటూ |
దూరువేసేవింతేకాక దోషమెవ్వరిదయ్యా ||

మనసు చూడవలసి మాయలు నీవే కప్పి |
జనులకు విషయాలు చవులుచూపి |
కనుగొంటే మోక్షమిచ్చి కానకుంటె కర్మమిచ్చి |
ఘనము సేసేవిందు కర్తలెవ్వరయ్యా ||

వున్నారు ప్రాణులెల్లా నొక్కనీగర్భములోనే |
కన్నకన్న భ్రమతలే కల్పించి |
యిన్నిటా శ్రీవేంకటేశ యేలితివి మమ్ము నిట్టె |
నిన్ను నన్ను నెంచుకుంటే నీకే తెలియునయ్యా ||

## కీర్తన : సతులాల చూడరే

సతులాల చూడరే శ్రావణబహుళాష్టమి
సకలాయ నడురేయి గలిగె శ్రీకృష్ణుడు ।

పుట్టేయపుడే చతుర్భుజాలు శంఖుచక్రాలు
యెట్టు ధరియించెనే యీ కృష్ణుడు ।
అట్టె కిరీటము నాభరణాలు ధరించి
యెట్ట నెదుట నున్నాడు యీ కృష్ణుడు ॥

వచ్చి బ్రహ్మయు రుద్రుడు వాకిట నుతించగాను
యిచ్చగించి వినుచున్నా(డీకృష్ణుడు ।
ముచ్చటాడీ దేవకితో ముంచి వసుదేవునితో
హెచ్చినమహిమలతో యీ కృష్ణుడు ॥

కొద దీర మరి నందగోపునకు యశోదకు
ఇదిగో తా బిడ్డాడాయె నీకృష్ణుడు ।
అదన శ్రీ వేంకటేశుడై యలమేల్మంగ(గూడి
యెదుటనే నిలుచున్నా డీకృష్ణుడు ॥

Get Telugu books at http://greatertelugu.com

## కీర్తన : సిరుత నవ్వులవాడు

సిరుత నవ్వులవాడు సిన్నెకా వీడు
వెరపెరుగడు సూడవే సిన్నెకా ||

పొలసు మేనివాడు బోరవీపు వాడు
సెలసు మోరవాడు సిన్నెకా |
గొలుసుల వంకల కోరలతోబూమి
వెలిసినాడు సూడవే సిన్నెకా ||

మేటి కురుచవాడు మెడమీది గొడ్డలి
సీటకాలవాడు సిన్నెకా |
ఆటదానిబాసి అడవిలో రాకాశి
వేటలాడీ జూడవే సిన్నెకా ||

బింకపు మోతల పిల్లగోవివాడు
సింక సూపులవాడు సిన్నెకా |
కొంకక కలికియై కొసరి కూడె నన్ను
వేంకటేశుడు సూడవే సిన్నెకా ||

## కీర్తన : శోభనమే శోభనమే

శోభనమే శోభనమే
వైభవముల పావన మూర్తికి ||

అరుదుగ మును నరకాసురుడు |
సిరులతో జెరలు దెచ్చిన సతుల |
పరువపు వయసుల బదారు వేలను |
సొరిది బెండ్లాడిన సుముఖునికి ||

చెందిన వేడుక శిశుపాలుడు |
అంది పెండ్లాడగ నవగళించి |
విందువలెనె తా విచ్చేసి రుకుమిణి |
సందడి బెండ్లాడిన సరసునకి ||

దేవదానవుల ధీరతను |
దావతిపడి వార్ధి దరుపగను |
శ్రీ వనితామణి జెలగి పెండ్లాడిన |
శ్రీ వేంకటగిరి శ్రీనిధికి ||

Get Telugu books at http://greatertelugu.com

## కీర్తన : శ్రీమన్నారాయణ

శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ ।
శ్రీమన్నారాయణ నీ శ్రీపాదమే శరణు ॥

కమలాసతీ ముఖకమల కమలహిత ।
కమలప్రియ కమలేక్షణ ।
కమలాసనహిత గరుడగమన శ్రీ ।
కమలనాభ నీపదకమలమే శరణు ॥

పరమయోగిజన భాగధేయ శ్రీ ।
పరమపూరుష పరాత్పర
పరమాత్మ పరమాణురూప శ్రీ ।
తిరువేంకటగిరి దేవ శరణు ॥

## కీర్తన : సువ్వి సువ్వి

సువ్వి సువ్వి సువ్వాలమ్మా
నవ్వుచు దేవకి నందను గనియె ||

శశి వొడచె అలసంబులు గదచె
దిశ దేవతల దిగుళ్ళు విడచె ||

కావిరి విరసె కంసుడు గినిసె
వావిరి పువ్వుల వానలు గురిసె ||

గతి సేసె అటు గాడిద గూసె
కుతిలకుడిచి జనకుడు నోరు మూసె ||

గగురు పొడిచె లోకము విధి విడిచె
మొగులు గురియగ యమునపై నడచె ||

కలిజారె వేంకటపతి మీరె
అలమేల్మంగ నాంచారమ్మకలుకలు తీరె ||

Get Telugu books at http://greatertelugu.com
cv

## కీర్తన : తెప్పగా మర్రాకు మీద

తెప్పగా మర్రాకు మీద తేలాడువాడు ।
ఎప్పుడు లోకములెల్ల నేలేటివాడు ॥

మోతనీటి మడుగులో యీతగరచినవాడు ।
పాతగిలే నూతిక్రింద బాయనివాడు ।
మూతిదోసిపట్టి మంటిముద్ద పెల్లగించువాడు ।
రోతయైన పేగుల పేరులు గలవాడు ॥

కోడికూత నోరివాని కుర్రతమ్ముడైనవాడు ।
బూడిద బూసినవాని బుద్ధులవాడు ।
మాడవన్నె లేడివెంట మాయలబడినవాడు ।
దూడల నావులగాచి దొరయైనవాడు ॥

ఆకసానబారే వూరి అతివల మానముల ।
కాకుసేయువాడు తురగముపైవాడు ।
ఏకమై వేంకటగిరి నిందిరారమణి గూడి ।
యేకాలముబాయని యెనలేనివాడు ॥

## కీర్తన : తిరుమలగిరిరాయ

తిరుమలగిరిరాయ దేవరాహుత్తరాయ |
సురతబిన్నాణరాయ సుగుణకోనేటిరాయ ||

సిరులసింగారరాయ చెలువపుతిమ్మరాయ |
సరసవైభవరాయ సకలవినోదరాయ |
వరవసంతములరాయ వనితలవిటరాయ |
గురుతైన తేగరాయ కొండలకోనేటిరాయ ||

గొల్లెతలవుద్దండరాయ గోపాలకృష్ణరాయ |
చల్లువెదజాణరాయ చల్లబరిమళరాయ |
చెల్లుబడిధర్మరాయ చెప్పరానివలరాయ |
కొల్లలైన భోగరాయ కొండలకోనేటిరాయ ||

సామసంగీతరాయ సర్వమోహనరాయ |
ధామవైకుంఠరాయ దైత్యవిభాళరాయ |
కామించి నిన్ను గోరితే గరుణించితివి నన్ను |
శ్రీమంతుడ నీకు జయ శ్రీవేంకటరాయ ||

## కీర్తన : త్వమేవ శరణం

త్వమేవ శరణం త్వమేవ శరణం కమలోదర శ్రీజగన్నాథా ॥

వాసుదేవ కృష్ణ వామన నరసింహ శ్రీ సతీశ సరసిజనేత్రా ।
భూసురవల్లభ పురుషోత్తమ పీత- కౌశేయవసన జగన్నాథా ॥

బలభద్రానుజ పరమపురుష దుగ్ధ జలధివిహార కుంజరవరద ।
సులభ సుభద్రా సుముఖ సురేశ్వర కలిదోషహరణ జగన్నాథా ॥

వటపత్రశయన భువనపాలన జంతు- ఘటకారకరణ శృంగారాధిపా ।
పటుతర నిత్యవైభవరాయ తిరువేంకటగిరినిలయ జగన్నాథా ॥

## కీర్తన : వందే వాసుదేవం

వందే వాసుదేవం బృందారకాధీశ
వందిత పదాబ్జమ్ ||

ఇందీవరశ్యామ మిందిరాకుచతటీ-
చందనాంకిత లసత్చారు దేహమ్ |
మందార మాలికామకుట సంశోభితం
కందర్పజనక మరవిందనాభమ్ ||

ధగధగ కౌస్తుభ ధరణ వక్షస్థలం
ఖగరాజ వాహనం కమలనయనమ్ |
నిగమాదిసేవితం నిజరూపశేషప-
న్నగరాజ శాయినం ఘననివాసమ్ ||

కరిపురనాథసంరక్షణే తత్పరం
కరిరాజవరద సంగతకరాబ్జమ్ |
సరసీరుహాననం చక్రవిభ్రాజితం
తిరు వేంకటాచలాధీశం భజే ||

## కీర్తన : వేదం బెవ్వని

వేదం బెవ్వని వెదకెడివి ।
ఆదేవుని గొనియాడుడీ ॥

అలరిన చైతన్యాత్మకు డెవ్వడు ।
కలడెవ్వ డెచట గలడనిన ।
తలతు రెవ్వనిని దనువియోగదశ ।
యిల నాతని భజియించుడీ ॥

కడగి సకలరక్షకు డిందెవ్వడు ।
వడి నింతయు నెవ్వనిమయము ।
పిడికిట తృప్తులు పితరు లెవ్వనిని ।
దడవిన ఘనుడాతని గనుడు ॥

కదసి సకలలోకంబుల వారలు ।
యిదివో కొలిచెద రెవ్వనిని ।
త్రిదశవంద్యుడగు తిరువేంకటపతి ।
వెదకి వెదకి సేవించుడీ ॥

## కీర్తన : వేడుకొందామా

వేడుకొందామా వేంకటగిరి వేంకటేశ్వరుని ॥

ఆమటి మ్రొక్కుల వాడె ఆదిదేవుడే వాడు ।
తోమని పళ్యాలవాడె దురిత దూరుడే ॥

వడ్డికాసుల వాడె వనజనాభుడే పుట్టు ।
గొడ్డురాండ్రకు బిడ్డలిచ్చే గోవిందుడే ॥

ఎలిమి గోరిన వరాలిచ్చే దేవుడే వాడు ।
అలమేల్మంగా శ్రీవేంకటాద్రి నాథుడే ॥

## కీర్తన : విడువవిడువనింక

విడువవిడువనింక విష్ణుడ నీపాదములు
కడగి సంసారవార్ధి కడుముంచుకొనిన ॥

పరమాత్మ నీవెందో పరాకైయున్నాను
పరగ నన్నింద్రియాలు పరచినాను ।
ధరణిపై చెలరేగి తనువు వేసరినాను
దురితాలు నలువంకఁ దొడికి తీసినను ॥

పుట్టుగు లిట్టె రానీ భువి లేక మాననీ
వట్టి ముదిమైన రానీ వయసే రానీ ।
చుట్టుకొన్న బంధములు చూడనీ వీడనీ
నెట్టుకొన్న యంతరాత్మ నీకు నాకుబోదు ॥

యీదేహమే యయిన ఇక నొకట్లైనాను
కాదు గూడదని ముక్తి కడకేగినా ।
శ్రీదేవుడవైన శ్రీవేంకటేశ నీకు
సోదించి నీశరణమే చొచ్చితి నేనికను ॥

## కీర్తన : విన్నపాలు వినవలె

విన్నపాలు వినవలె వింత వింతలు |
పన్నగపు దోమతెర పైకెత్తవేలయ్యా ||

తెల్లవారె జామెక్కె దేవతలు మునులు |
అల్లనల్ల నంతనింత నదిగోవారే |
చల్లని తమ్మిరేకులు సారసపు గన్నులు |
మెల్లమెల్లనె విచ్చి మేలుకొనవేలయ్యా ||

గరుడ కిన్నరయక్ష కామినులు గములై |
విరహపు గీతముల వింతాలాపాల |
పరిపరివిధముల బాడేరునిన్నదివో |
సిరిమొగము దెరచి చిత్తగించవేలయ్యా ||

పొంకపు శేషాదులు తుంబురునారదాదులు |
పంకజభవాదులు నీ పాదాలు చేరి |
అంకెలనున్నారు లేచి అలమేలుమంగను |
వేంకటేశుడా రెప్పలు విచ్చి చూచి లేవయ్యా ||

రాగం: భూపాళం

## కీర్తన : విశ్వరూపమిదివో

విశ్వరూపమిదివో విష్ణురూపమిదివో
శాశ్వతులమైతిమింక జయము నాజన్మము ||

కొండవంటి హరిరూపు గురుతైన తిరుమల
పండిన వృక్షములే కల్పతరువులు |
నిండిన మృగాదులెల్ల నిత్యముక్తజనములు
మెండుగ ప్రత్యక్షమాయె మేలువోనాజన్మము ||

మేడవంటి హరిరూపు మించైనపైడి గోపుర
మాడనే వాలిన పక్షుల మరులు |
వాడల కోనేటి చుట్ల వైకుంఠ నగరము
యీడమాకు పొడచూపె ఇహమేపోపరము ||

కోటిమదనులవంటి గుడిలో చక్కని మూర్తి
యీటులేని శ్రీ వేంకటేశుడితడు |
వాటపు సొమ్ములు ముద్ర వక్షపుటలమేల్మంగ
కూటువైనన్నేలితి యెక్కువనోనాతాపము ||

## కీర్తన : కామధేను విదే

కామధేను విదే కల్పవృక్ష మిదే
ప్రామాణ్యము గల ప్రపన్నులకు ॥

హరినామజపమే ఆభరణంబులు
పరమాత్మునినుతి పరిమళము ।
దరణిదరు పాదసేవే భోగము
పరమంబెరిగిన ప్రపన్నులకు ॥

దేవుని ధ్యానము దివ్యాన్నంబులు
శ్రీవిభు భక్తే జీవనము ।
ఆవిష్ణు కైంకర్యమే సంసారము
పావనులగు యీ ప్రపన్నులకు ॥

యేపున శ్రీవేంకటేశుడే సర్వము
దాపై యితని వందనమే విధి ।
కాపుగ శరణాగతులే చుట్టాలు
పై పయి గెలిచిన ప్రపన్నులకు ॥

# మంగళం

# గ్రేటర్ తెలుగు భక్తి కదంబం